నాయుడుపిల్ల

1

ఈ సంబంధం నీకిష్టమేనా అని మావాళ్ళడిగింది నిజమే. ఒక్కత్తే కూతుర్ని. నాకు యిరవైయేళ్ళు వొచ్చాయి. గోషాగనక బయిటికి వెళ్ళడానికి వీల్లేదన్నమాటేగాని, యింటో పెత్తనమంతా నాదే. డబ్బు నష్టం దెబ్బతిన్న తరవాత, నాన్న దూకుడంతా అణిగింది. సగం వెర్రిగా వుండేవాడు. అమ్మకి ఎప్పుడూలేదు బుద్ధిబలం. అందుకని పెళ్ళిసంగతి నన్నడక్క తప్పిందికాదు. అయినా వాళ్ళ మనసూ పీకిందనుకుంటా. నన్ను ముసలివాడికియ్యవలసి వొచ్చిందే అని. ఈయనకి యాభైయేళ్ళు పైగా వుంటాయి. యాభైపైన యాభైకంటె తక్కువే మొత్తానికి.

వొప్పుకోనా వొద్దా అని సందేహంపట్టుకుంది నాకు. పైకి నాయిష్టమని అన్నారేగాని అమ్మావాళ్ళూ, ఆయన వొచ్చి నన్నిమ్మని అడిగేటప్పటికి యెదిగిన కూతురనే మహాదురవస్థలోంచి తప్పించడానికి వొచ్చిన దైవంలాగ కనపడ్డాడు ఆయన వాళ్ళకి. నా అంత అదృష్టవంతురాలు లేదంది అమ్మ. నాలుగు భవంతుల యిల్లు, గుర్రంబండి, బంగారు సులోచనాల జోడు, వెండి పొడుంకాయ, యివన్నీ తలుచుకోమంటుంది. అంతకంటె యేంకావాలి? పరజాలు కట్టినా, గుర్రంబండీ యెక్కి తిరగొచ్చునుకదా! కిటికీలు మూసినా ఆ పెద్దయింట్లో వుండొచ్చుకదా! వొంటరిగా అయినా వెండిగిన్నెల్లో కాఫీ తాగొచ్చుకదా! యెవరూ చూసేవారుండకపోయినా, బనారసు చీరెలు కట్టొచ్చు, కాసులపేర్లేసుకోవచ్చు. యింకేం?

అదిగాక నాన్న చాలా సంతోషిస్తారు. ఆయనకి నాన్న వెయ్యి రూపాయలు బాకీ. కన్యాశుల్కంకింద ఆ ప్రామిసరీనోటు యిచ్చేస్తానన్నాడు. వున్నడబ్బంతా, వర్తకమని తగలేసి, సిగ్గుపడి, మూలకూచున్న

నాన్నని చూస్తే నాకు చాలా దిగులేస్తుంది. ఈరుణం తీరితే యీ యిల్లన్నా నిలుస్తుంది యీ ముసలాళ్ళకి. లేకపోతే, వాళ్ళిద్దరూ పోయింతరవాత నేనేమౌతానా అని నాన్నకి దిగులు. పాపం, డబ్బులేక నాన్న సిగరెట్లు మానుకొన్నారు. అమ్మ నగలన్నీ అమ్మేసుకుంది. వాటిని తలుచుకొని యేడుస్తూ వుంటుంది.

కాని నా ఆలోచనలన్నీ యేమవుతాయి? చిన్నప్పణ్ణించి నేననుకున్నవన్నీ? యెవరో వీళ్ళందరికంటే గొప్పవాడికి నన్ను పెళ్ళి చేస్తారనీ, అతన్ని చూస్తే నాకెంతో ప్రేమా, గౌరవం వుంటుందనీ, అతనుకూడా నన్ను చాలా లాలిస్తాడనీ అనుకునేదాన్ని. ఇంక అతనితో సరసాలూ, సిగ్గులూ, మోహాలూ, అన్నీ ప్రతిరాత్రీ ఆలోచించుకునేటప్పటికి, నిజంలాగే కనపడేవి. మధ్యాహ్నం భోజనమయింతరువాత, కుర్చీలో నాన్నా, చాపమీద అమ్మా నిద్రపోతూవుంటే, కిటికీలో, తడికవెనకాల పూలు అల్లుకుంటూ కూచుని, రోడ్డుమీదవాళ్ళని చూస్తూ యివన్నీ ఆలోచించుకునేదాన్ని. ఆతోవని పొయ్యేవాళ్లల్లో అందంగా నాయుడికుర్రవాడిలాగ, యెవరో కనపడితే, అతనే అనుకొని, చాలరోజులు అతనిరూపమే, నా భర్తకింద చూసుకునేదాన్ని. యింకొకరు కనపడగానే, పాతది పోయి కొత్తది నా మనసులో ఆ స్థాన మాక్రమించుకునేది. యెన్ని ఆలోచనలు! పెళ్ళికాగానే, గదిలో నన్ను మొదట చూడడం. అంత అందంగా వుంటాననుకోక, నన్నుచూసి భ్రమిసిపోవడం, తనచెయ్యి నా బుజంమీద వెయ్యపోవడం, నావొళ్ళు జల్లుమనడం, నేను తప్పించుకోపోవడం, అతను పట్టుకోడం, నా ఆనందం, మొదటి ముద్దులూ, మోహాలూ, అతనికి నేను కావలసిరావటం.........అన్నినీ, అతనికికూడా నేను కొత్తే! ఆడవాళ్ళే కొత్త, నాకు మొగవాళ్ళు కొత్తలయినట్లు, నేనతనికి యింకో లోకంనించి దిగివొచ్చిన అప్సరసని. అందరి ఆడవాళ్ళవంటిదాన్ని కాదు ఆయనకు. ఆయన నాకు దేవదేవుడికంటె గొప్పకాదూ మరి? యిన్ని ఆలోచనలుండేవి.

మరి యీయనో! గుమ్మంపరజాలోంచి చూశా. నెరిసిన జుట్టూ, దవడలూ, మెడా, ముడతలూ, చత్వారం కళ్ళూ, పొట్టిగా లావుగా, యేం ఆనందముంటుంది యీయనతో? ఈయనకి ముచ్చటలన్నీ యిదివరకే తీరాయి. అంతాపాతే. పొడుంకాయా పొన్నుకర్రా, ఆల్పాకాకోటు, లేవూ, అట్లానే నేనూను- మామూలు అయివుంటా, నేను కావలసికాదు. యేదో ఒక ఆడపిల్ల కావాలి, అంతే. మంచంపోతే పెళ్ళి మంచం చేయించుకోడా?

నేనని యింకెవర్నన్నా పెళ్ళి చేసినా వూరుకుంటాడు. యేదో ఆడదయితే చాలు. మొహమొహ్మాపుంటేనేం? పోనీ, నేనని యింకెవర్నన్నా చేస్తే ఇంకెవరొప్పుకుంటారు? దౌర్భాగ్యురాల్ని! నాకు తప్పకొచ్చిందిగాని?

అయితే, యీ సంబంధం వొదులుకుంటే మళ్ళీ సంబంధం దొరుకుతుందా? అసలు యే మొగుడూ లేకుండా పోతాడేమో? నాఖర్మ యిట్లా కాలిందిగాని, నాయీడుపిల్లల కెన్నో సంబంధాలొస్తాయి. పార్థసారథే దీని కంతా కారణం. చిన్నప్పుడు మాయిద్దరికి స్నేహం. నాకు గోషాపెట్టిం తరువాతకూడా యింటోకి అప్పుడప్పుడు వొచ్చేవాడు. దాంతో మాయిద్దరి పేర్లూ వీధిగోడల మీదికెక్కాయి. మా యింటిపక్కన మాజ్ఞాతులున్నారు. యే సంబంధం మానాన్న నాకు కష్టపడి తీసుకొచ్చినా, యీసంగతీ యింకా అబద్దాలుకొన్ని, కల్పించి చెప్పి, పంపించేశారు. వూళ్ళో గోడలమీద అక్షరాలు చెరిగాయి కాని, వాళ్ళమనస్సుల్లో చెరగలేదు. పాపం పార్థ సారథిని వాళ్ళవాళ్ళు చదువుకని యెక్కడికో పంపించేశారు. అదివరకేమీ లేదుగాని, గోడలమీద పేర్లుపడి, అతను వెళ్ళిపోయిన తరవాత నా కతనిమీద ప్రేమవొచ్చింది. అతని మీద కలలు అనేకం కన్నా. ఆలోచించా. ఇప్పటికీ అతనంటే ఆనందంగా వుంటుంది. యీ సంబంధం వొదులుకుంటే, యింక నాకు పెళ్ళికాదనుకుంటా- పెళ్ళి కాకుండానే నాన్నా అమ్మాపోతే, వొంటరిగా యీ యింట్లో వుండనా? అప్పాకి యిల్లు సరి- యింకపిన్నిగారి యింట్లో చేరాలి. దిక్కులేక ఆపిన్నిదగ్గిర చేరడంకంటే వెయ్యేసి యేళ్ళున్న పదిమంది ముసలివాళ్ళని చేసుకోడం నయం.

యింతకీ నేను యీయన్ని పెళ్ళిచేసుకుంటేనేం? పిల్లలు, బంధువులు, సంబంధాలు, సుఖాలు అన్నీ వుంటాయి. ఇంకేం? గౌరవం, ప్రతిష్ట, నౌకర్లు, అన్నీనీ లోటేమిటి? యింక యెటువచ్చీ ముసలి వాడనా? దాని వొక్కదాని కోసం యిన్ని పోగొట్టుకోనా? నాకు కావలసిన ప్రేమనూ, ఆనందాన్నీ ఇవ్వలేడా? వాటికోసం చూస్తే, అసలు యేమీ లేకుండాపోతే?

సరే! వొప్పుకుంటా. అంత పెద్దవాణ్ణి చేసుకోడం, తెలివయిన పనికాదు గాని, యేంచెయ్యను? పెళ్ళిచేసుకుంటేనేగాని, ఆడదానికి గతిలేదు. మఱి యితను తప్పితే పెళ్ళిఅయ్యే సాధనంలేదు. పెళ్ళిచేసుకోక పోతేనేమో! నా అంతట నేను ఒంటరిగా బతకన్నాడదూ, ఇష్టమయిన వాడు దొరికిందాకా? మృగాలూ, పక్షులూ, పురుగులూ, మొగాళ్ళూ, అందరూ

స్వతంత్రింగా బతుకుతారు. ఈ మనుష్యుల్లో ఆడదానికి మాత్రం బతకాలంటే పెళ్ళిచేసుకుతీరాలి. యెందుకో ?

నిశ్చయించుకున్నా. నాయుడుగారి భార్యను కాబోతున్నా. ఇష్ట మొచ్చినట్లు సౌఖ్యపెట్టవొచ్చు దేహాన్ని. యేం? మనసు మాత్రిం సౌఖ్యపడ కూడదూ ? లోకంలో అందరూ యింతకంటె యేం సౌఖ్యమనుభవిస్తున్నారు? యిన్ని సౌఖ్యాలున్నప్పుడు ప్రేమలేకపోతే మాత్రిమేం? యీ పెళ్ళయిన వాళ్ళందరికీ ప్రేమవుందా ? దాని సంగతి మరిచిపోతానేమోలే. ఇప్పుడే మరిచిపోతా అవన్నీ. ఆ ఆశలన్నీ పోవాలి. నా యవ్వన మాధుర్యాన్ని తలపుకన్నా రానీను. అవన్నీ దొంగకలలు, యిదేనిజం............ యవ్వన సౌఖ్యాలేమిటి ? నాలుగేళ్ళుంటాయి, తరవాత పోతాయి. చూసుకోవలసింది ముసలితనంవరకు శాంతి.

2

పెళ్ళయి మూడునెల్లయింది. నాఅంత తెలివితక్కువ మొద్దు లోకంలో లేదు. ఇంత ఘోరమైన పొరబాటు యెవరూ చెయ్యలా. ఇంతవరకు యేదో సౌఖ్యపడతాననుకున్నా. మొద్దయినా, మొగుడొకడుంటే చాలుననుకున్నా. నేను తవ్వుకున్న పెద్దగోతులో నేనేపడ్డా. నేను చేసిన యీ ఘోరమైన పొరబాటు ఆడవాళ్ళందరికీ వెయ్యికంఠాలతో చాటించా లనిపిస్తోంది. నా అరుపు విని వొక్కళ్ళన్నా యిల్లాంటి నరకంనించి తప్పించుకుంటే చాలు. ఈడుకాని వాళ్ళ పెళ్ళి కూడదని తెలిసి కూడా యీపని చేశాను. కోర్కె లోకంలోవున్న ప్రేమసంతా అనుభవిద్దామనీ-చేసుకుంది నాకంటె ముప్ఫైయేళ్ళు పెద్దవాణ్ణి. ఆకోర్కె పోయిందను కున్నాను. మరిచిపో గలననుకున్నాను. యెంతపిచ్చిదాన్ని ! కొంతమంది నన్నూ, నాహోదాన్ని చూసి వోర్చలేకపోతున్నారు కూడాను.

యెవరితోనూ వొక్కమాటచెప్పలేదు. ఈ విషయమై నేను-అమ్మతో కూడా సిగ్గులేక యేమని చెప్పుకోను ? చెప్పుకుంటే మాత్రం, యెవరి కర్థ మవుతుంది ? అర్థమయినా, యెవరేంచేస్తారు ? నా పెనిమిటికి తెలీనే తెలీదు. పెళ్లికి నా ఆత్మ నమ్మకున్నాను.

మొదట గదిలోకి పంపిన రాత్రి తెల్లారకట్ట మెళుకువ వొచ్చింది. చెక్కింద యేదో చప్పుడవుతోంది. చుట్టూ చూశా. నాన్నగదిలో పెద్ద

పందిరి పట్టెమంచంమీద, యీ కొత్తాయిన పక్కన పడుకునివున్నా. బయట నించి సన్నగా వెలుతురు లోపల పడుతోంది. దీపం తెలతెలబోతోంది. ఆయనవొంక చూశా. లావుగా, పెద్దగా, బొర్రికనపడుతో, వెల్లకిత్తులగా పడుకుని వున్నారు. మంచంపందిరివేపు నోరు తెరుచుకుని, గురక పెడుతున్నారు. ఆ గురకే నన్ను లేపింది. ముక్కులోంచి వూపిరి పీల్చటంలేదు. గాలిబదులు యేదో నల్లగా కాలవగట్టి, ఆ పొట్టిమీసాల్లోంచి కారుతోంది. ఆనోరు బాబోయి! కట్టించుకొన్న పళ్లు రాత్రెప్పుడో తీసేశారు. చిగుళ్ళ మొండితునకలు కనపడుతున్నాయి, చప్పిదవడలు, చొంగ. తలకి చలిటోపీ తగిలించారు. ఆ కోతిటోపీలోంచి మొఖం యేం అందంగా కనపడుతోందని! ముద్దులొలికిపోతోంది. ఆ రొమ్ముమీద వెండ్రుకలు పక్కల్ని గుండ్రిగా గొరిగించాడు. చొక్కా తీసేస్తే ఆ వొళ్లు ముడతలూ, ఆ చంకలూ, అమ్మోయి! కళ్లు మూసుకొన్నా.

దీన్నా నేను కోరికోరి చేసుకున్నది? ఇంకా యెంతకాలం బతుకుంది?.........

రాత్రి చేసిన పలహారాలూ, తమలపాకుల తొడిమలూ, నన్ను వెక్కిరిస్తున్నట్లున్నాయి. ఇదా నా పెళ్ళి? రాత్రి పడుకోబొయ్యేముందు యింత అసహ్యం వెయ్యలేదు,.........మెళ్లో చూసుకున్నా, ఆయన కట్టిన బంగారు గొలుసువేపు. నా వొళ్ళు నున్నగా రక్తంచిమ్మి, మెరుస్తోంది ఆ వొళ్ళు? ఇంక నాకు సౌఖ్యమేమిటి? సంతోషమేమిటి? నన్నుచూస్తే నాకే జాలేసింది. బతికివున్నన్నాళ్ళూ యీయనతో యేం చేస్తోవుంటా?

చిన్న పెళ్ళాం, నాకొత్తఅందం, యివి నాయుడుగారికి నవయవ్వనమిచ్చాయి కొత్తలో వొకవారం. కాని ఆరిపొయ్యే దీప మెంతసేపు వెలుగుతుంది? ఒకసారి భగ్గుమంది. అంతేకాని నాలో వెలుగుకి శాంతి యేదీ? అప్పుడే మొదలయ్యేను! నాకు యవ్వనం, మోహం, బలం కావాలి. ఈయన బండీ, మేడా, భోజనం యిస్తాడు. వీటిల్లో అవి మరిచిపోతాననుకున్నాను. కాని యివన్నీ వాటిని యెక్కువ చెయ్యడం మొదలుపెట్టాయి. అణపరాని వేదన ప్రారంభించింది. కాని ఆయన్ని చూసి నిరాశలో చచ్చిపోతోంది.

3

ముసలాయనకి పనులు శ్రద్ధతో చేస్తున్నా. స్వయంగా దగ్గిరకూచుని వొడ్డిస్తా. బట్టలూ, అన్నీ సిద్ధంగావుంచుతా. ముసలితనంలో ఆయనకి

విసుకులేకండా అన్నీ తయారుగా వుంచుతున్నాను. ఇదంతా చూసి ఆయనకి నామీద చాలాదయ. అందరితోనూ నాసంగతి గర్వంగా చెప్పుకుంటారు. నేనడిగిందల్లా ఆరోజే తెచ్చిపెడతారు. యెన్నో కొత్తనగలు చేయించారు. అయితే యేం లాభం? మా నాన్నగారికి డబ్బుంటే నాకివన్నీ చేసేవారుకాదూ? అంతే, యేం భేదంలేదు, యెందుకీ భోగాలన్నీ! వొక్కరవ్వ గాఢమయిన మోహంకోసం, తిండిలేకుండా మాడమంటే మాడతాను.

అయిన పెళ్ళి ఏదో అయిపోయింది. వూరికే దిగులుపడీ, ఎన్నటికీ సంభవించని వాటికోసం ఆశపడీ, వుత్త బాధేకాని ఏంలాభం? అని మనసునీ గుండెనీ రాయిచేసుకుని ఆయన్ని సంతోషపెట్టాలని చూశాను. కాని లాభంలేదు. నా నరాలు పీక్కుపోతున్నాయి. నాకు పిచ్చి ఎత్తేట్టుంది. చివరికి మొగనౌకర్లని చూచినా నామనసు నిలవటం లేదు. ఏ నిమిషాన ఏం పాడుపని చేసేస్తానో అని భయంగా వుంది. నాకేనా ఇట్లా? నావంటి నిర్భాగ్యుల కందరికీ ఇంతేనా? నేనే దుర్మార్గురాలినా? నా రక్తంలోనే యీ నీచత్వం వుందా? చచ్చినవాళ్ళ కోసం ఏడిస్తే వొస్తారా? అట్లానే మండిపోయిన యవ్వనం కోసం పెనుగులాడితే ఏమన్నా లాభం వుంటుందా అని ఎంత చెప్పుకున్నా, రాత్రింబవళ్లు ఏంచేస్తున్నా, అదే ధ్యాస అయిపోయింది. చివరికి ఈగల్ని, పిచికల్ని చూసికూడా ఈర్ష్య పుడుతోంది. బిగ్గిరగా అరవాలనీ, గాలిని కావిలించుకోవాలనీ మతితప్పుతుంది.

నాకీ యింటోంచి పారిపోవాలని వుంది. కాని యెక్కడికి? నాన్న రానీడు. అప్పుకూడా తీరిందా? నాయుడుగారికి కోపంరానీడు. యేమైపోను? ఇవన్నీ వొదిలిపెట్టాలే? వేళకి భోజనం, ఆవు పెరుగూ, మాంసం కూరా, చీనాపట్టు చీరలూ, అగరునూనె, వెండిగిన్నెలూ, గడియారం గొలుసూ, మాటలేనా? యివన్నీ అనుభవించేటుంత అదృష్టం పట్టడం? వీటిని చేతులారా వొదులుకోనా? పట్టుపరుపూ, తెల్లనిదుప్పట్లూ మాటలా?

ఈ భోజనంతో రోజురోజూ దిట్టంగా లావెక్కుతున్నాను. తిండీ! పనేమీలేదు. లావుగాక యేంచేస్తాను? ఈ భోజనం వొదులుకోగలనా? కాని నాకిక్కడుండాలని లేదు. పోవడానికి వీలుంటే బావుండును. ఆడపిల్లల్ని నిరాధారంగా మొగుళ్ళమీద పారేసి వూరుకోడం యెంత అన్యాయం? యేంచేసినా, తప్పించుకోడ మెట్లా? తప్పించుకోకూడదనే వీళ్ళ అభిప్రాయం. తప్పించుకుంటే ఈ ముసలాళ్ళకి చిన్న పెళ్లాలెట్లా

దొరుకుతారు ? అందులో యీ ఘోషా. రోడ్డుమీద యెట్లా నడుస్తారో కూడా మరిచిపోయినాను కదా ! యీ రోడ్డు దాటితే అడివో, కొండలో తెలీదు. అడివెట్లా వుంటుంది ? నాకు యేదన్నా చేసి సంపాయించు కోడమే చాతయితే, యీ యేడుపు వుండదుకదా ? ఇట్లా బలవంతంగా రెక్కలు కట్టి, యీ గోషా పంజరాల్లో పెట్టి, మేతకోసం, యీ మొగాళ్లే కందిస్తారు. వూరికే సంస్కరణాలు మాట్లాడతారు యీ దేశభక్తులు. స్వతంత్రింగా బతకడానికి వీల్లేదూ ? మాకువోట్లుట ? యింక బతుకు తెరువు లేకే కదూ యెంత తొరగా వీలయితే అంత తొందరగా యెవరికో వొకరికి మమ్మన్ని కట్టెయ్యడం ?

పిల్లలన్నా వుంటే యింత దుర్భరంగా వుండదేమో, బతుకు ! కాని పిల్లల ఆశ లేదని మొదటిరాత్రి తెలిసింది. పెళ్లి చేసుకుని కూడా గొడ్రాల్ని కావలసిందే ? ఇట్లాంటి భర్త వుంటేవున్నాడు, పిల్లలుండ కూడదూ ? పిల్లలకోసం పరితపిస్తూ, ఈ మండే కోర్కెతో నా బతుకంతా యిట్లా వుండవలసిందేనా ? ఆ పోట్లావుకి దూడవుంది, ఆ కుంటి కోడికి ఆరు పిల్లలున్నాయి, మా యింటో పని చేసే యానాదిదానికి పదిమంది పిల్లలు; బిడ్డ బిడ్డ అని; ఆ చిన్ని చేతులకోసం, ఆ తడుముకునే నోరు కోసం. కలవరించే నాకేనా బిడ్డలేనిది ? ఇట్లాంటి ముసలి మొగుణ్ణి, దగ్గరన్నా చేరనిస్తాయా ఆ జంతువులు ? ఆ జంతువుల కంటే అధమ మయిందే నా బతుకు ? అవి సృష్టి కార్యాన్ని నెరవేరుస్తున్నాయి. కాని నేనో ? నీళ్ల గదిలో నా వొళ్లు చూచుకుంటూ ఎప్పుడూ. నా సౌందర్యపు వొంపులూ, ఆ బలం, కండలు, లోకాన్ని నవ్వులతో నింపే బిడ్డల తల్లిని కావడానికికదూ నన్ను సృష్టి యేర్పరచింది; పెంచింది; యీ అణపలేని కోర్కె నిచ్చింది ? కాని సంఘం, యీ కులం, యీ వివాహచట్టం, యేరి యేరి యీ ముసలి నిచ్చాయి. సృష్టి ఆగదు; సంఘం ఆగదు. ఈ కాల్చే కోర్కె ఆగదు; లోలోపల దగ్ధమై నశించేది నేనే. నన్ను తాకడం, నాదగ్గిరనించి పాలు తాగడం, యెంత యిష్టంగా వుంటుంది నా పిల్లలికి ? మొదటామెకీ బిడ్డలు లేరు. మా యిద్దరిదేనా తప్పు ? పాపం ఆమెకూడా నాకుమల్లేనే బిడ్డలకోసం యేడ్చి యేడ్చి, అట్లానే పోయింది గావును !

అయ్యో చిన్నవాణ్ణే యెవరినన్నా చేసుకునివుంటే యెంత బావుం డును ! చిన్నప్పుడు పార్థసారథితో మాట్లాడినందుకు కాదూ ? సంఘం నామీద నిందలు మోపి, యీ ముసలాయన తప్ప గతిలేకుండా చేసింది ?

మళ్లీ పైగా నిన్నెవరు యీ ముసలాణ్ణి చేసుకోమన్నారని యెదురుతిరిగి అడిగేదీ వీళ్ళే. నా కర్మమంటారు పైపెచ్చు. అంతా వీళ్లు చేసి, స్వర్గ మొస్తుందిలే, చచ్చింతరవాత, అని వోదారుస్తారు. యెందు కా స్వర్గం? యాడవను. ఆ స్వర్గంకోసం వీళ్లందరూ ముసలాళ్లని కట్టుకోరేం?

4

క్రిమంగా మారిపోతున్నాను. నా ప్రేమ, దయా మాయమవుతున్నాయి. కఠినత్వం, చిరాకూ అలవాటవుతున్నాయి. నేనిట్లా బాధ పడుతో యింకొకరికి దయ యేం చూపించను? పడుచు మొగుళ్లున్న వాళ్లనీ, చక్కని బిడ్డలున్న వాళ్లనీ, ఎవరిని చూచినా నాకు వొళ్ళు మండిపోతోంది.

ఈ యెండాకాల మెంత వేడిగావుంది! రాత్రులుకూడా ఒకటే వుక్క. నిద్రిరాదు. ఆయన నన్నుకూడా తనతో గదిలోనే పడుకోమంటారు. బయట పడుకుంటే యెవరన్నా గోడెక్కి నన్ను చూస్తారన్న భయం ఆయనకి. డాబామీద పడుకుంటే పక్క మేడమీదివాళ్ళు చూస్తారని భయం. అంతలావున్నా ఆయనికి వుక్క పొయ్యదుగావును? హాయిగా నిద్రిపోతారు. అయితే పనిచేసి అలిసి వొస్తారు. అదిగాక నల్లమందు అలవాటని కూడా నాకు అనుమానం. ఆహా! యిట్లాంటిరాత్రులు చెయ్యి చెయ్యి పట్టుకుని, యెవరన్నా చిన్నవాడితో యీ బయట తోటలో తిరుగుతో వుంటే యెంత బావుంటుంది! ఈ నాయుడుగారు తొమ్మిదింటికే పంది మల్లే పడి గుర్రు కొడతారు. వొంటిగంట కొట్టినా నాకు నిద్రిరాదు. మేలుకుంటే మాత్రం యీాయనతో షికార్లు! షికార్లే!

అదిగో! ఆ మూల పక్కమీద పడివుంది మాంస పర్వతం. గుర్రు కొడుతోంది. ఆ గుర్రు వింటే నా నరాలు మండిపోతాయి. చేతి కేం దొరికితే అది ఆ నెత్తిన విసిరెయ్యాలనిపిస్తుంది. చెంబెడు నీళ్ళు పోస్తే ఆ గురక ఆగేట్టు! అంతే, తెల్లవారిందాకా అంతే! ఒకటే నిద్రి. ఇల్లు తగలబడుతున్నా, భూమి బద్దలవుతున్నా, మెళుకువ రాదు.........
ఎన్నాళ్లని యిట్లా సహించి వుండడం? ఇంకా యెంతకాలం బతుకుతాడో యీ ముసలాయన? పిల్లలు లేకపోతే పీడాబాయిరి యీ శనన్నా వొదిలితే! యీ మంచంమీదినించి! ....పాపం, నామీద యింతదయ

చూపిస్తోవుంటే, యేం చేశారని యీయన్ని యీ తిట్లు! యెంత చెడ్డదాన్నవుతున్నాను? కాని యీయనిట్లా బతుకుతోనేవుంటే!

చచ్చిపోనా! ధైర్యముంటుందా? అమ్మా? ఇంత జీవనశక్తినీ, మాతృప్రేమనీ, సౌందర్యాన్ని, యీ జీవన మాధుర్యాన్నీ, ఆ నీళ్ల కప్పచెప్పనా?............యెందుకు, పోయినా ననుకుంటారు? పిచ్చి అంటారు. యెవరికన్నా అర్థమవుతుందా! యిట్లాంటిబాధ పడ్డవారికితప్ప?

బిడ్డలుంటే యింత బాధవుండదు. ఆ ఆశ లేదుగా! పోనీ యెవరికన్నా కంటే, యెవరున్నారు? ఈ మొహం తప్ప యింకోటి కనపడితేనా? తప్పా? పాపమా? యేం తప్పు? నాదేం తప్పు? ఈయన్ని కనోద్దన్నానా? ఆడదాన్ని, యింత బలం, అందం, ఆరోగ్యం, మాతృప్రేమ వున్నదాన్ని, బిడ్డలు కనడం, నా జన్మ హక్కు కాదూ? సృష్టిలో యే ఆడజంతువన్నా కనకుండా వుంటుంగా? ఈయనమూలాన నా హక్కుని నేను వొదులుకొని యెందుకు బాధపడాలి? పోనీ! యీయనమీద నాకు ప్రేమ వుంటే అనుకోవచ్చు. ఆ ప్రేమకోసం, బిడ్డలు లేకపోతే పోనీ, యింకొకరికి నా దేహమిస్తానా అని సందేహించవొచ్చు. నాకూ యీయనకీ సంబంధం యేమిటీ? నా భర్త యెట్లా అయినాడు? నన్ను తల్లినన్నా చెయ్యలేనివాడు, నాకు గర్భాన్ని దానం చెయ్యలేనివాడు, నాభర్తేమిటి? ప్రేమాలేదు. బిడ్డలూలేరు. ప్రేమించడానికి భర్తాలేక, బిడ్డలూలేక యెందుకు బతకడం? ఈయన్నే ప్రేమించాలంటారు, దైవముగా చూచుకోవాలిట! యెవరో ఆమాట పుట్టించింది? యెవరో యెందుకూ పనికిరాని ముసలిమొగుడే! ఇదిగో, ఈ గురకపెట్టే, పొడుం నీళ్ళుకారే, పళ్ళులేని, ఈ బోశాయిన్ని చూసి, వీడేం దైవమంటే! వాళ్ళ నిజం దైవాలు యిట్లానే వుంటారుగావును? దైవంగా చూచుకోవాలిట! ఆ మూల గుళ్లోవున్న శిల యెంత దైవమో, యీయనా అంతే. ఇద్దరూ వున్నారు లావుగా అవతారాలు, యెందుకు?.........నాకు చిన్నవాడే భర్త అయితేనా? దైవమా, దైవాతి దైవాన్ని చేసుకునేదాన్ని కాదూ? ఆ కాళ్లని కళ్ల కద్దుకొని, నా జుట్టుతో పాదాలని తుడిచేదాన్ని. అంత అదృష్టమే వుంటే యింకేం కావాలి? పెళ్లి చేసుకోడమే దైవాన్ని పెళ్లి చేసుకోవాలి గాని, ఈ ముసలితొక్కుని దైవం చేసుకోడమెట్లా? ఈయన్ని దైవ మన్నతరవాత, నిజమైన దైవాన్ని చూచినా, పరమ అసహ్యం పుడుతుంది.

ప్రతిరోజు రాత్రి యింతే. తొమ్మిదింటికల్లా అందరూ వెళ్లిపోతారు. మే మిద్దరమే యింటికల్లా. ఆయన నిద్రపోగానే, యీ వరండాలో బయట ఇటూ అటూ తిరుగుతోవుంటా, నా ఉద్రేకాలతో బాధపడుతో.........

5

నిన్నరాత్రి తమాషా అయింది. నేను కలలోనన్నా అనుకోలా, నా కంత అదృష్ట మొస్తుందని. విచ్చిన బొడ్డుమల్లెల వాసనేస్తోంది. పైరుగాలి తిరిగింది. హృదయారాటం యెక్కువయింది.................. నా వెనక యెవరో నుంచున్నారు చీకట్లో. భయం వేసింది.

"నాన్నమ్మా !"

కలలో జరిగిన సంగతేదో మళ్లీజ్ఞాపక మొచ్చినట్లుంది.

"పార్థసారథీ !"

వుక్కవల్ల రవికన్నా వేసుకోలేదు. నన్ను యినుపకమ్ములవంటి చేతులతో బిగించి, ముద్దుపెట్టుకున్నాడు. ఆహా! యెన్నేళ్లమట్టి కలలు కంటున్నా అట్లాంటి ముద్దులకోసం ? యేమేమిటో గారాబపు మాట లన్నాడు.........యింక నా కేమక్కర్లేదని పించింది లోకంలో. జన్మమంతా ప్రేమలేకుండా గడపవలసివచ్చినా దిగులులేదు. అనుభవించాను. నాశనములేని ఆ నిమిషాన్ని. సంఘం, నీతి, పతివ్రతలూ, నాయుడుగారూ ఎవ్వరూ ! యీనిమిషాన్ని నాదగ్గిర్నించి లాక్కోలేరుకదా ?.......... అకటితోటంలోకి తీసికెళ్లా. చివరికి నాచిన్నిప్రియుడితో, తోటలో చెయ్యా చెయ్యాకలిపి నడిచాను. నాకలలన్నీ నిజమైనాయి. ఆముద్దులతో నాముసలి తనమంతా పోయింది. ఆ కోపం ముడతలు కరిగిపోయినాయి. తోటలో గచ్చు అరుగుమీద నా పార్థసారథి చేతులమధ్య పడుకున్నాను ముద్దులతో అలసిపోయి. అట్లానే పడుకుని నా చెవులో తన సంగతంతా చెప్పాడు. యింటరుమీడియేటు పరీక్ష తప్పి, కలకత్తా వెళ్లాడు. అక్కడ చదువుతో, నాన్ కోఆపరేషన్ చేసి, ఇంటికి వొచ్చాడు. రాగానే నాకోసం వెతికాడు. ఇన్నాళ్లూ నన్ను మరిచిపోనేలేదుట. నాకు పెళ్లయిందని తెలియగానే గుండెల్లో రాయి పడ్డది. బతుకుమీద ఆశే పోయింది యెందుకోగాని. నేను తనని మరచిపోలేదనీ, యీ ముసలాయనతో సౌఖ్యంగా వుండననీ, తనని చూడగానే ప్రేమిస్తానని నమ్మకం పుట్టింది. వారంనించి యీ యిల్లు కనిపెట్టి

వున్నాడు. రెండురాత్రిలు వరసగా, నేనిట్లా తిరగడం చూశాడు. ఈవేళ ధైర్యంచేసి గోడదూకి వొచ్చాడు.........నేను యెప్పటికి తన దాన్నే నన్నాడు. ప్రేమవుంటే యీ పెళ్ళి అడ్డమా! తన నిట్లా కలుసుకోడం తప్పే కాదని రూఢిపరిచాడు. అట్లా సమాధానం చెపుతోవుంటే నా కెంతో బావుంది.

6

ప్రతిరోజు రాత్రి వొస్తున్నాడు. చీకట్లో యిద్దరం కలుసుకుంటాము. ముందు సంగతి యేమన్నా కానీ, యిప్పటికి ఆనందంగా వున్నాం, మాకంతే చాలు.........నేనూ చాలా టక్కులు నేర్చుకుంటున్నాను. ముందు ఆయనప్రక్కన నిద్రపోయినట్లే పడుకుంటా. పైగా గురకవల్ల నాకు నిద్రపట్టడం లేదని, ఆయనతోనే చెప్పా. ఒక వేళ ఆయన మెలుకువవొచ్చి, నేను కనపడక యెక్కడికి వెళ్ళావని అడిగినా, నిద్రపట్టక, వరండాలోకి వెళ్ళాననొచ్చు, అట్లా వెదుతోవుంటాననికూడా అన్నా. ఆయన అక్కడ వెతికితే, తోటలోకి వెళ్ళానంటా. కాని ఆయన అసలు లేవరుగా? భయమేం లేదు. మోసం చెయ్యడ మెట్లానో ప్రేమ నేర్పుతోంది నాకు. చాలామంది ఆడవాళ్ళకి ప్రేమ నేర్పుతుంది మోసమంతా. అయినా మోస మేమిటి? అసలు యీ ముసలాయనకీ నాకూ సంబంధ మేమిటి? యెప్పుడూ చిన్నప్పణ్ణించీ నా ప్రేమంతా పార్థసారథి మీదనే అయ్యేను.

7

నిన్న రాత్రి నేను వెళ్ళేటప్పటికే, తోటలో వున్నాడు పార్థసారథి. తోటలోంచి గడ్డివాము దొడ్డిలోకి తీసుకెళ్ళా. జనపకట్టెలు తియ్యని వాసన వేస్తున్నాయి. వాటిమధ్య నుంచున్నాము. లోకాన్నే మరిచిపోయినాం. పార్థసారథి గడ్డివాము మీదికెక్కి నాకు చెయ్యందిచ్చాడు. ఇద్దరం చుట్టి చుట్టుకుని దానిమీద పడ్డాం. కింద మెత్తని కొత్తగడ్డి, పైన నిర్మలమైన ఆకాశం. మమ్మల్ని మెల్లిగా కదిలిస్తున్న యెండాకాలపు రాత్రిగాలి! యింక యేంకావాలి! ఆకాశంతప్ప యింకే కనపట్టంలేదు. ఆ నక్షత్రాల మధ్య వున్నట్టేవుంది. నల్లని చీకటి కప్పేసింది మా యిద్దరినీ, యెవరూ చూడకండా. ఆ మహానక్షత్రమండలములో, భూమీ, సంసారం, పెళ్ళీ, నీతీ

అన్నీ మాయమైనాయి. అంతెత్తునుంచి యివేం కనపడతాయి ? మా గాఢమైన ప్రేమ ఆ కాంతికంటె వెలుగయింది. కొట్టుకునే మా హృదయాలు, ఆ నక్షత్రాలకంటె, గంభీరమైనవి. ఆ మహా నిర్జీవమైన లోకానికంతా మేమిద్దరమే. హృదయం, హృదయాని కెదురుకొట్టుకుంది. రాత్రి జీవన నాళాలతో కొట్టుకొంటోంది. నేను నాయుడుగారి భార్యనికాదు అప్పుడు. నాన్నమ్మనికాదు. స్త్రీని. లోకంలోవున్న ప్రేమశక్తు లన్నిటితోనూ వొకటయి నా ప్రియుడితో మహా ఆకాశంలో విహారం సలిపే స్త్రీ శక్తిని ....యింకా దగ్గిరగా, నా యింద్రియాలు జ్ఞానం తప్పేట్లు, యింకా దగ్గిరగా చేర్చుకున్నాడు. ఆహా ! యెంత శాంతివొచ్చింది నాకారాత్రి !

నేను బతికినకాలమంతా ఆ రాత్రికోసం బతికాను. నాముసలితనం, చీదరా, విచారం, అన్నీ వొదిలిపోయినాయి ఆరాత్రితో. ఆ మహాప్రేమలో పవిత్రమయింది నా దేహం. మానవులకికూడా యింత సౌఖ్య ముంటుందా యీ లోకంలో ! అనిపించింది. ఇప్పటికి నా అందం వుపయోగించింది. యింకొకరి కానందం ఇచ్చింది. నాకు మహా ఆనందాన్ని తీసుకొచ్చింది. ఆ ముసలాయనికి నేనైతేనేం యెవరైతేనేం ? కాని నా పార్థ నాకోసమే వొచ్చాడు. నేనే కావాలి అతనికి - నా అందమే కావాలి............

.........చీకట్లోకూడా పార్థకళ్ళు ఆనందంతో మిణుగురు పురుగుల్లాగు మెరుస్తో కనపడ్డాయి. చేతులు చేతులు పెనవేసి నిద్రపోయినాము-మధురమైన నిద్ర - మా ఇద్దరికళ్లనీ కలిపి ముద్దుపెట్టుకోడానికి వొచ్చిన నిద్ర ....తూర్పునించి తెల్లని కాంతి వొచ్చి లేపింది. తెల్లారకట్టే కోవెల లెమ్మని కూసింది. వొద్దని చల్లని పైరుగాలి వీచింది. కష్టంమీద లేచి వెళ్లిపోయినాము. ఇంట్లోకి వెళ్లడం కైదులాగుంది. ఇంటో యేదిచూచినా అసహ్యమే............

.........కోయిలెందుకు అంత చక్కగా అరచిందో తెలిసిందినాకు. ఆకాశంవేపు చూస్తో, చెట్టుమీద గూట్లో నాకుమల్లే ప్రేమ ననుభవించింది గనకనే ఆ సంతోషం.........

8

అందరూ ఇట్లాంటి యెండలెప్పుడూ చూడలేదంటున్నారు. వాన కురవదేమంటారు. కాని నాకుమాత్రం యీవేడి చాలా బావుంది. వాన

వొద్దు. గడ్డిమేటిమీద పడుకోడానికి వీలుండదు. పగలు ఎంత వేడయితేనేం రాత్రిట్లాంటి గాలి వొచ్చేటప్పుడు ?......... మనుష్యులు రాత్రులెందుకు నిద్రపోతారో? ఇప్పుడు తెలుస్తోంది నాకు రాత్రుల అందం. నా నిద్రంతా పగలే. ఈ వేడివల్ల నిద్రపోతున్నా ననుకుంటున్నా డీయన.

నేను చేసేది నీతి కాదంటుంది పుణ్యలోకమంతా. కాని ఆ పిచ్చి అభిప్రాయాలూ, మూఢత్వం వదిలేశా. నక్షత్రాలన్నాయి నేనుచేసేది తప్పు కాదని, యీప్రజలో లెఖ్ఖ నాకు! సప్తమహాఋషులు చూశారు. నేననుభ వించే మహాసౌఖ్యాన్ని. వాళ్ళు తప్పులేదన్నారు. నాకింకేంభయం? మహా పతివ్రత అరుంధతి నన్నర్థం చేసుకుంది. ఇంత శాంతినీ, సౌఖ్యాన్నీ, ఇస్తున్న యీ ప్రేమ దుర్నీతా? ఆ వుక్కపోసే గదిలో, చెమటలో, ఆ మహా మాంసఖండాన్ని కావిలించు కోడం నీతా? కావిలించుకున్నా, అది కదలదుగా? ఆ కదలకపోవడం, కదలడానికి శక్తిలేకపోవడం, శక్తిలేదని తెలిసికూడా పెళ్లిచేసుకోడం, పెళ్లిచేసుకున్నా, కదలకండా నన్నుకూడా ఆగదిలో కావిలించుకు పడుకోమనడం, పాపంకాదూ? పాపం కాదన్న వాళ్లు ఒకరాత్రంతా ఆయన్ని కావిలించుకుని పడుకోండి తెలుస్తుంది......... నా హృదయం సంగీతాలు పాడుతోంది. నా ప్రతినాడీ ఆనందంతో తాళం వేస్తోంది. దీన్ని వొదులుకుంటానా? మీరు దుర్నీతి అన్నారని భయపడి నా స్వర్గాన్ని నేను ఒదులుకుంటానా? యేంచాతగాక, భయపడి యేడ్చే వాళ్ల దగ్గిరికె పొండి యీ నీతి అధికారాలు చలాయించడానికి. నాతోకలిసి నక్షత్రమండలం అందుకున్న నా పార్థసారథి దాన్ని నేను. మీకు అర్థంకాక పోతే యేడవండి. మేమేగదా నీతిపరులమని కులకండి. ప్రేమకి బదులు లోకంలో యింకేమన్నా సంపాయించగలరా? తక్కువవాటికోసం ప్రేమను వొదులుకునేవాళ్ళని చూస్తే నాకు దిగులేస్తుంది. బంగారాన్ని వొదిలి, నీతి రాళ్ళతో నింపుకుంటున్నారు. మీ జీవితాలని.........మాయింటికి నన్ను చూడవొచ్చిన వాళ్ళందరూ నాకళ్ళల్లో, మాటల్లో, నడకలో, పొంగే యీ సంతోషాన్ని చూచి, ఆశ్చర్యపడుతున్నారు. నా హృదయంలో దాచుకున్న యీ అమృతం సంగతి వాళ్ళకేం తెలుసు? నాకు దొరికిన యీ అమూల్య మైన నిధిసంగతి లోకానికి వెళ్ళడి చెయ్యాలనిపిస్తోంది. లోపల్నించి అలలమల్లే పొంగివొస్తోంది. ఆనందం ఎట్లా దాచుకోను? యెంతహాయి! యీ జీవన మెంత అందమయింది.

9

దేవతలు నా మీద ఆశీర్వచనాలు గుమ్మరించాగు. ఈ ప్రపంచ
గానశ్రావ్యము గింగురుమంటోంది నాచెవుల్లో. ఈకాంతిఅంతా నాదేహంలో
ప్రవేశించి ధన్యురాల నయినాను. నాలో కొత్త జీవన మొకటి కదిలింది.
తల్లిని కాబోతున్నాను. యెందుకా నాదేహం రోజురోజూ యింత అందంగా
కనపడుత[illegible]నుకున్నా. తల్లినైతే, ఆ చిన్న లేతగులాబి చేతులు, నారొమ్ము
లమీద వేసి, పాలుకుడుచుకుంటూ వుంటే! ఓహో యెందుకు నా కింత
అదృష్టం! యేంచేశాను?. యేదో చాలా పుణ్యంచేశాను. ఇంకేముంది?
నా పార్థకి నాదేహం, నా సౌందర్యమిచ్చి సంతోష పెట్టడమే, నేను చేసిన
మహాపుణ్యం. పాపమా? పాపమైతే, యీ మహాకరుణ యీశ్వరుడు
నామీద చూపిస్తాడా? నాకీ భూలోకంమీదే స్వర్గమిచ్చాడు. ఇంతకన్న
స్వర్గం నాకింకేముంది? అరుంధతే నన్నిట్లా ఆశీర్వదించింది.........
పాపమా? నా బిడ్డ పుట్టకని పాపమన్నవాళ్ళు నాశనమవుతారు. వాళ్ళవోర్చ
లేనితనం వాళ్ళకే తగుల్తుంది. బిడ్డల్లేక, ప్రేమలేక, అట్లానే కుళ్ళి,
వొంటరినై, ముసలిదాన్నై, వరడునై, యెండి, యేడుస్తో చస్తే మీ కళ్ళు
చల్లగా వుంటాయా, పతివ్రతా తల్లుల్లారా! మీరందరూ హాయిగా గంపెడు
పిల్లల్తో ప్రతిరోజూ కాపరాలు చెయ్యడమేం, నేనిట్లా ముసలిమొగుడితో
పడి చావడమేం? నా కర్మమా? నేనిట్లా ఆనంద మనుభవిస్తోవుంటే
చూడలేక, వుక్రోషంతో, పాపమని నన్ను నరకంలో తోయ్యాలని చూడ
డం, మీఖర్మం! మీదేఖర్మం! నాదికాదు. నాతో మాట్లాడం మానేస్తారు,
నన్ను వెలేస్తారు, యింట్లోంచి, వెళ్ళకొట్టిస్తారు. కాని నే ననుభవించిన
ఆనందాన్ని లాక్కోలేరుగదా! నాబిడ్డని నాచేతుల్లోకి రాకండా చెయ్యలేరు
గదా! అంతే నా క్కావలసింది. ఇంక మీరేమన్నా చేసుకోండి నాకు
లక్ష్యంలేదు.

నేనూ అతనూ కలసి, మహదానందంలో సృష్టించిన ఆచిన్ని
జీవాన్నీ, నా వెనుకలోనించి బయటికివొచ్చిన నా చిన్నికూనని, నామాంసం
లోంచి వొచ్చిన ఆచిన్నశరీరాన్ని యెత్తుకుంటా, యీచేతుల్లో. నేను
తప్ప గతిలేనిదాన్ని, భద్రంగా కాపాడుతా, పోషిస్తా. నన్ను 'అమ్మా'
అంటే యీచెవులతో వింటా. ఆమాట అనడానికీ నాచిన్నముండ చేసే
ప్రయత్నాలు చూసి పరవశనైపోతా. పార్థమీద నాకు మరీప్రేమ

యెక్కువయింది యిప్పణ్ణించి. ఈవాళరాత్రి యీసంగతి చెపుతా, యేమంటాడో ? యింక నన్ను వొదిలెయ్యాలన్నా వొదిలేసి పోగలడా?.........

10

రాత్రి వెళ్ళేటప్పటికే గడ్డిఅంతా సర్ది మెత్తగా మాకు పక్క తయారుచేసి వుంచాడు. దానిమీద నక్షత్రాల కాంతిలో అతనిచేతుల్లో అతనివేపు తిరిగి పడుకుని చెప్పాను. ఆవేశంతో నాజబ్బమీద పళ్ళతో గట్టిగా పట్టుకున్న మచ్చ నల్లగా యింకా కనబడుతోంది. దాన్ని చూసుకున్న కొద్దీ నాకిష్టమెక్కువవుతోంది. రాత్రి నిశ్శబ్దం. నేనుచెప్పే రహస్యం వినడానికి, సృష్టే, ఆగి, అక్కడనుంచున్నట్లుంది. నాజుట్టుని తనచేత్తో పైకి దువ్వి, నాగడ్డం చేత్తో పట్టుకుని, నాకళ్ళలోంచి లోపలికి, లోపలికి, నా ఆత్మలోపలికి చూసినట్లు చూశాడు. నా జుట్టులో తనమొహం దాచేసి—"నాన్నా నాన్నా నిజమేనా ?" అన్నాడు. అతని మోహం బలమంతా నామీద విరుచుకుపడ్డది పెద్ద తుపానులాగు. నన్ను నలిపేశాడు తన చేతుల్లో, రొమ్ము కదుముకుని. నాబిడ్డ తండ్రి, నాలోపలి జీవానికి జీవమిచ్చిననాడు, అతనిదాన్ని కాకండా, లోకమంతా కలిసినా చెయ్యలేరు కదా ! నాపొరపాటుకి జాలిపడి, నావొంటరితనానికి, నా ప్రేమలేని జీవాన్ని చూసి కనికరించి నాకు యీశ్వరుడిచ్చిన పార్థ! అతన్ని వొదులుతానా ? నాబిడ్డ తండ్రి కాకండా యెవరూ చెయ్యలేరుకదా మమ్మన్ని విడదీసినా !

పార్థ నన్ను తనతో వొచ్చెయ్యమన్నాడు యీ యింటోంచి. ఈ మధ్యాహ్నం యీ నడవాలో వొంటరిగా కూచుని ఆలోచిస్తున్నా, వెళ్ళనా వొద్దా అని. ఇన్ని సౌఖ్యాలు వొదలాలే, ఈచీరెలు. యీగదులు, యివన్నీ వొదిలేసి, చిరుగు చీరెలు కట్టుకుని, యెక్కడో దుమ్ముకొట్టి చిరుగుతో వుంటే, పార్థసారథికి యిప్పటిమల్లే ప్రేమ వుంటుందా ? ఏదో ఒకటి వేళకు దొరికింది తింటూ, వున్నప్పుడు తిని, లేనప్పుడు పస్తు పడుకొని నేను బతగ్గలనా ? అప్పుడూ పార్థకి యింత అందంగా కనపడతానా ? అందంగా కనపడకపోతే, నామీద యిష్ట మిట్లానే వుంటుందా అతనికి ?

కాని యీ ముసలాయిన్ని చూసినకొద్దీ కోపమెక్కువవు తోంది. పార్థసారథి నా జీవితంలోకి వొచ్చినా, యింకా నా భర్తనే అంటాడీయన. నిద్రపొయ్యేముందు ఆ పెద్ద మంచంలో పడుకుని, నామీద చేతులేస్తాడు. తనని చూసి నేను భ్రమసిపోతున్నాననే గావును ఆయన వుద్దేశ్యం!...... పాపం యెంత ప్రేమ యీ ముసలాయనికి నామీద, యిట్లా తిడుతున్నా గాని. అంత పిసినారీ, నేనేమడిగినా కాదనకండా తెచ్చిస్తాడు. అయన్నేడి పించడం, యేం కృతజ్ఞత?............ఈయన నా మామగారై వుంటే యెంత బావుండేది? అడిగిందల్లా యిట్లా నాకు ప్రేమతో యిస్తో, ఆ గడ్డి వాము మాకు వొదిలేసి, తనొక్కడూ ఆ మంచంమీద పడివుంటే? అట్లా వుండకండా నామీద చేతులెయ్యాలని చూస్తాడు?...,.....నాకు కొడుకు పుడితే తన కొడుకే అంటాడుగావును! అందరూ యీయన కొడుకే అంటారు నా పార్థ కొడుకుని. నేనదెట్లా భరిస్తా? పైగా పోలికలు చుస్తారు.........చెప్పనా ఈయనకు కడుపుతోవున్నానని? మరిచెప్పి తీరాలి యెప్పుడో త్వరలోనే? పిచ్చి వెధవ, చాలాసంతోషిస్తాడు. తండ్రి అయ్యేటంత హోదా తనకేకదా కలిగిందని. అదంతా తన ప్రయోజకత్వమే అనుకుంటాడు. తన వంశం నిలబడుతుందని పొంగిపోతాడు. నన్నింక కాలు కింద పెట్టనీడు. కొండమీది కోతినన్నా కావాలంటే తెచ్చిపెడతాడు ....అయినా ఈయనతో వుండడం నాకిష్టంలా. ఇక్కణ్ణించి వెళ్ళడమూ యిష్టంలా. ఈయనపోతే బావుండును. ఇంకా యెన్నాళ్ళు బతుకుతాడో! ఎన్నటికీ చావకండా వరంపొందినవాళ్ళల్లో యీ ముసలాళ్లు మొదటివాళ్ళు...అయ్యో పాపం! ఈయన్ని చావాలని కోరుకుంటానేం? యెంత చెడ్డదాన్నవుతున్నా! ఈయనంత వుపకారం చేసినవాళ్ళు నాకింకెవరూలేరు. ఈయనే లేకపోతే యిట్లా మర్యాదగా పార్థసారథికి బిడ్డని కనడానికి వీలెల్లా వుండేది?

పార్థసారథితో వెళ్ళిపోనా? ఈ కొత్తప్రేమ పోయింతరవాత, యెందుకు వచ్చేశానా అని దిగులేస్తుందేమో? ఈ సౌఖ్యాలూ, ప్రేమా, రెండూ వుండుకునే పద్ధతిలేదూ? మనసంతా వొకరికిచ్చి, దేహం యింకొకర్ని తాకనియ్యడమంత నరకం యింకేమీలేదు.........ఈ సౌఖ్యాలన్నీ కావాలనడం కూడా పార్థసారథికి అందంగా కనపడాలనే.........పార్థ వూపిరాడకుండా అడుముతో, వొస్తావా? రావా? అంటే రానని యెల్లా అనను? కాని యింకేవిధం లేదూ, వెళ్ళకండా?

11

పార్థసారథికి భయం పోతోంది. నిన్న నేను వేళకి తోటలో తన కోసం వుండకపోతే యింటోకి వొచ్చాడు. ఈ సారి గదిలోకి వొచ్చి లాక్కెడతానన్నాడు. తన దగ్గిరికి నేను వొచ్చేముందు, ఆ తోటలోనుంచుని ఆ నిముషం ఆ ముసలాయన నన్నేం చేస్తున్నాడో, అని కోపంతో వొళ్ళు మరచిపోతాడు. ఇంక ఆ వెర్రి యెక్కువయిందంటే యెప్పుడో మా గది లోకి వొచ్చేసి యీయనతో నాకోసం పోట్లాడుతాడు. మరి నేను మాత్రి మేంచెయ్యను? ఒక్కొక్కరోజు ఈయన పదకొండింటిదాకా నిద్రపోరు. పార్థ తోటలోనించి మమ్మన్ని చూడకండా కిటికీలన్నీ వేశేస్తా. దీపం తగ్గిస్తా. "నీకుకూడా సిగ్గూ, జాగర్తా వొచ్చాయే? పెద్దదానవవుతున్నా" వని సంతోషిస్తారు............నిన్న రాత్రి మరీ బలవంతం చేశాడు పార్థ తనతో వచ్చేసి తీరాలని. రాకపోతే వొప్పుకోనన్నాడు. కాని నా సందేహా లతనితో యెల్లా చెప్పను? అతని ప్రేమమీద నాకు సందేహమని చెప్పడ మెల్లా? యెప్పుడో వొకరాత్రి మళ్ళా నే నింటోకి పోకండా వూళ్ళోకి లాక్కెడతాట్ట. ప్రేమ యింత గొప్పదనీ, ప్రేమ లేకండా బతకలేననీ, తెలిసికూడా యింకా యెందుకు సందేహిస్తానో తెలీదు. ఏదో భయంగా వుంది. నా మర్యాదా, ప్రతిష్టా, కులంవాళ్ళతో పొత్తూ పోతాయని భయ మేమో? యింత పిరికిదాన్నేం?

నాకు గర్భమని ఈయనికి తెలిసింది. ఇంక ఆయన సంతోషానికి మేరలేదు. ఆవెర్రి సంబరంచూస్తే నా కసహ్యంవేస్తోంది. ఇంత తెలివితక్కువ వాళ్ళుకూడా వున్నారు లోకంలో. ఇప్పుడు నాకేం కావాలన్నా యిస్తాడు. యేం చెయ్యమన్నా చేస్తాడు. ఈయన వెర్రి తనం చూసి, దిగులు కూడా పుడుతుంది. మా యింటికి నన్ను చూడ్డానికి వొచ్చిన సూర్యనారాయణగారి ఆడవాళ్ళు నా సంగతి గుర్తుపట్టి ఆయనతో చెపితే ఆసూర్యనారాయణగారు యీయన్నడిగారుట. నిజమేనా? అని నన్నడిగా రీయన. యేమనను? "నాతో యెందుకు చెప్పలా? అంతా సిగ్గా?" అని బుగ్గ పట్టుకున్నాడు. నాన్న పట్టుకున్నట్టే. పార్థతో చెపితే, జరిగిన సంగతి జ్ఞాపక మొచ్చింది.

ఇంటిచుట్టూ తిరిగి నేను వొదలబొయ్యే ఈ మంచి మంచి వొస్తువు లన్నీ చూచుకుంటున్నా. ఈ నిలువుటద్దం చూస్తే నా కెంతో యిష్టం.

దాన్ని తీసుకెళ్ళడానికి వీలుందేమో? ఈయన్ని అడగనా? నవ్వొస్తోంది, యేం వెర్రి వూహాలు పుడుతున్నాయి? ఈ నగలన్నా రెండు తీసికెళ్ళకండా వుండగలనా? ఈ పలకసర్లూ, అడ్డిగా నా మెళ్ళోంచి తీసేటప్పుడు యేడుపు రాదూ? కాని పార్థ ఒక్క నగ కూడా తీసుకురావడానికి వీల్లేదంటున్నాడు.

12

సంగతులు నా కనుకూలంగా తటస్థిస్తున్నాయి. ఆయన వూరికెళ్ళాడు. వొక్కత్తెనీ వొదిలి వెళ్ళాలే అని సంకోచించారు. ఒకవేళ చివరికి వెళ్ళరేమోనని భయమేసింది. మళ్ళా తొందరగానే వొస్తాలే అని వోదార్చారు. అంత గుడ్డిమనిషేం? నా మొహంలో సంతోషం కనపడలేదూ? నేనూ వేషాలేశాను. తొరగా రమ్మని బతిమాలుకున్నాను.

ఆ రాత్రి పార్థని యింటోకి రమ్మంటే రాలేదు. నిన్న రాత్రికూడా వెడదామా వొద్దా అని యింకా అనుమానిస్తూనే వున్నా. "నన్ను నమ్ము, నామీద విశ్వాసముంచు, నీకేం కష్టం కలుగనీను. రమ్మ"న్నాడు. కాని యింటోకి వచ్చి పార్థసారథి ఈ వెండి సామానులూ, భోజనం, మంచం అవీ చూస్తే, యివన్నీ వొదులుకొని రమ్మంటాడా అప్పుడు కూడా అని సందేహంగావుంది. ఇటువంటివన్నీ తనకోసం వొదులుకు వొస్తున్నాననన్నా తెలుస్తుంది. పోనీ తన బిడ్డకి యివన్నీ వుండాలనన్నా అనుకోడూ తను? నిన్న రాత్రి యింక ఈ వాళ తనతో రాకపోతే వెళ్ళిపోతానన్నాడు.

"నన్నొదిలి పెడతావూ? నీకు చాతనవుతుందీ? యేమ్మాటల్లే" అన్నాను.

"చూసుకో, అంత చాతగానివాణ్ణనుకున్నావా? అతనిదానివన్నా, నాదానివన్నా కావాలి నువ్వు. ఇంక నే నాగను. ఆ ముసలాయన్ని పాపం యిల్లా మోసం చెయ్యడం నా కసహ్యమేస్తోంది. ఇంక భరించలేను నీ యిష్టం" అని కఠినంగా అన్నాడు.

అట్లానే కదలకండా అతని చేతుల్లో పడుకున్నాను. తెల్లని వెన్నెల యిట్లా నన్ను బలవంతం చేస్తున్నందుకు నాకు సంతోషంగానే వుంది. నామీద యింత ప్రేమగనకే, నన్నంత బలవంతం చేశాడు. నన్ను కావిలించుకున్న ఆ గట్టిచేతులు వొణికాయి. నిజంగా నన్ను వొదిలేసి వెళ్ళి

పోతాడేమోననే భయంతో నేనూ వొణికాను. పార్థ నెట్లా వొదులుకో గలను ? గట్టిగా పట్టుకున్నాడు నన్ను. నా గర్భంలో బిడ్డ కదిలింది. మా బిడ్డ...... మా యిద్దరి బిడ్డ...... మా యిద్దరిమధ్యా కదిలింది. అతను మళ్ళీ వొణికాడు. అతనికీ తగిలింది కావును. ఆ అద్భుతమైన నిమషంలో కాలమే ఆగిపోయింది. మా అనురాగంకోసం, తన తండ్రికోసం, ఆ బిడ్డ తానే మాట్లాడినట్లుంది. నిశ్చయించుకున్నాను. భూములు, ఐశ్వర్యం, నగలూ సౌఖ్యం, మర్యాదా నీతి, యివన్నీ నాకూ నా బిడ్డతండ్రికీ, మధ్య రానిస్తానా ? తండ్రి, తల్లి, బిడ్డా, యింకేంకావాలి ? నాచెయ్యిని అతని మెడచుట్టు వేశాను.

"వొస్తా."

13

జరిగినగోల, అవమానం, దుఃఖం, తలుచుకుంటే ఆ పదిహేను రోజులూ యెట్లా బతికానా అనిపిస్తుంది. రైలులోంచి దిగకముందే నన్నూ పార్థని అరెస్టుచేసి ఆవూరు మళ్లీ తీసికెళ్ళారు. ఇంక పోలీసు, కోర్టు విచారణ. యెన్నో అడావిళ్లు. నాగోషా, గీషా అంతా యెగిరిపోయింది. గుంపులు గుంపులు వొచ్చి నన్ను చూసేవాళ్ళే ! పోలీసువాళ్లు నన్ను ఆయ నతో ఆయనయింటికి పొమ్మన్నారు. నన్ను చంపినా నేను వెళ్ళనన్నాను. లాక్కెళ్ళి పడేస్తామన్నారు. పడెయ్యగానే మళ్లీ పార్థదగ్గిరికి పరుగెత్తుతా నన్నాను. నాకు అప్పుడు అంత ధైర్యం. యెట్లావొచ్చిందో తెలీదు, యెన్నడూ గుమ్మందాటి మొగవాడిమొహం యెరగనిదానికి ! అందుకే నేమో అంత మొండితనం. మొగాళ్ళతో మాట్లాడేవాళ్ళకి సిగ్గు చాతనవు తుంది. గోషావాళ్ళు ఒకసారి బయటపడ్డారా, సిగ్గూ, భయమూ అలవాటు లేకపోవడంచాత వాళ్ల తెగింపు యెవరికి వుండదు. నన్నుకూడా పార్థతో కైదులోపెట్టారు. ప్లీడర్లూ, విచారణా యేమేమిటో కలలోమల్లే జరిగిపోయి నాయి. కాని యెన్నైనాసరే పార్థని వదలననీ, పార్థ నన్ను వదలడనీ, నిశ్చయమేర్పడ్డది. యేవిచారణలైతే నాకేం ? ఒకరోజు యిద్దరినీ కచేరిలో నుంచోపెట్టారు. ఆ ముసలాయనకూడా వున్నాడు. ఆయనవంకన్నా చూడ లేదు నేను. ఆ మాస్ట్రీటు పార్థకి ఒక సంవత్సరం కైదువేశాడు. నా కళ్ళు తిరిగాయి, వొణుకు పుట్టింది. యేదో ధైర్యం వచ్చి,

"మరి నాకో ?" అని అరిచాను,

మాస్ట్రీటు తలయెత్తి నావంక చూసి వూరుకున్నాడు. ఇంకో ఆయన యెవరో "నువ్విట్లాంటి బుద్ధితక్కువపనులు చెయ్యక పెనిమిటితో సలక్షణంగా కాపరముండు" అన్నాడు.

నా పార్థకి నన్ను కావిలించుకున్నందుకు కైదా? నాకు ముసలాయనతో కైదా?

"నాకుకూడా అతనితో కైదు వెయ్యండి. నేనూ అదే తప్పిదం చేశాను" అన్నాను.

యెవరూ వినుపించుకోలేదు. నా ఆవేశంలో, నామహావిచారంలో, సిగ్గూ, భయం ఎగిరిపోయినాను. పార్థమీద యెంత ప్రేమ వొచ్చిందీ చెప్ప లేను. నా కడుపు చీల్చి పేగుల్ని అతని కాళ్ళక్రింద పారెయ్యాలనిపించింది. పోలీసులు అతన్ని వెనక్కి తీసుకుబోతున్నారు. పరిగెత్తికెళ్ళి అతన్ని కావిలించుకున్నాను.

"పార్థా, ఆ కైదులోంచి వొదలగానే నాదగ్గిరికి వొస్తావుకదూ? ఒక్కనిమిషం ఆలస్యం చెయ్యకండా! యెక్కడ యెట్లావున్నా సరే, నీతో వొచ్చేస్తా"నన్నాను.

"తప్పకుండా" అన్నాడు దృఢంగా.

"సరిగ్గా రోజులు లెక్కపెట్టుకొని రాకపోతివా! చచ్చిపోతా, ఇంక నన్ను చూడవు" అన్నాను.

14

నా పార్థని తీసుకుపోయినారు. ఇంక నే నెక్కడ వుంటేనేం? నా వొళ్ళు నాకు తెలీదు. నాయుడుగారు యింటికి తీసుకుపోయినారు. ఆయన నాతో మాట్లాడలేదు. అమ్మమాత్రం వొచ్చి రోజూ యేడ్చేది. నాన్న నా మొహం చూడనన్నాట్ట. బంధువులు, స్నేహితులు యెవ్వరూ రావడం మానేశారు. ఎంతో రక్షించారు.

వికారం, డోకులూ, యేమీ సయించదు. నా నడుము చక్కని వొంపులన్నీ నాచుకొని అసహ్యంగా తయారవుతున్నాయి. ఒకసారి నాయుడుగారు నాకు వినపడేట్టు అంటున్నాడు.

"ఈ పాడుముండ కోసమా? ఆ పుట్టబోయ్యే వంశాంకురం కోసం గాని? ఆ వెధవా యిదీ యేమేట్లోనన్నా తగలపడనీ?"

మొదట నాకు నవ్వొచ్చింది గాని, తరవాత చాలా కోపమొచ్చింది. నాపార్థ బిడ్డని, తన వంశాంకురంట! వీడిమొహానికి! పార్థరాగానే ఒక్కరోజు అక్కడవుంటేకదా! వంశాంకురం వుండదు, గింశాంకురం వుండదు.

ఆయన్ని చూస్తే పూర్వం జాలివేసేది. ఇప్పుడు మొహంచూస్తే డోకు వెళ్ళుకొచ్చేది. ఆయన యెదురుపడితే ఆయన మొహాన్నే చీదరించుకొని అవతల పొయ్యేదాన్ని.

నాకు పండగలు, వుత్సవాలు చేశారు కొద్దిగా. యెవరికి మనసు పుడుతుంది చెయ్యడానికి? అప్పటికీ ఆయనకి సిగ్గులేదు. తను చేశానను కునే ఘనకార్యానికి బడాయి తగ్గలేదు. యెవరు యింటికి వొచ్చినాసరే!

"మా యింటో యేనిమిషాన పురుడు వస్తుందో అని ఆదుర్దాగా వుందండి? లేక లేక మా వంశానికి........."

యిట్లా మాట్లాడేవాడు, అదే అదే మాట. నాతోనే మాటలుంటే యెంత వాగేవాడో! పాపం యెంతయినా ఆయన్ని చూస్తే నాజాలి తగ్గదు.

ఫాల్గుణ పౌర్ణమినాడు అబ్బాయి పుట్టాడు. మొదటిరోజు వాడి మొహం యేమీ తెలీలేదు. కాని పుట్టగానే యెంతప్రేమ వొచ్చింది నాకు! నా హృదయములో అంత ప్రేమ వుందని నాకెన్నడూ తెలీదు. అప్పుడు గనక పార్థ వొచ్చి "నా ఖైదు అయిపోయింది, యీవాళ నాతోవొస్తావా" అంటే అబ్బాయికి చలిగాలి తగులుతుంది రానన్నేదాన్నే. యెంతప్రేమ ఆ కోతివంటి ముడతల వొంటిమీద! యెర్రని లేతనోరు నారొమ్ముకి తగిలేటప్పటికి నా ప్రాణాలన్నీ లేచివొచ్చి ఆ రొమ్ముచివర అమృతాన్ని తాగుతున్నట్లయింది. అట్లాంటి అనుభవ మయిం తరువాత, దాంటోనే కళ్ళుమూసి యీలోకంలో మళ్ళీ తెరవని తల్లులు యెంత ధన్యులో! నాకే అట్లా అయితే నరకబాధ తప్పును కదా!

ఆ వొక్క నిమిషపు సుఖం, నేనుపడ్డ పదిగంటల నరకబాధనీ, చల్లని చేత్తో తుడిచేసి, మాయం చేసినట్లయింది. తల్లికావడం కంటె పుణ్యకార్యం యేముంది లోకంలో? మూడోరోజు నా అబ్బాయిని చూసే ప్పటికి నాగుండెల్లో అణపరాని మహా ఆనందం, వూపిరాడనీకండా కమ్మేసింది. యెవరదీ? నా చిన్నపారి! నా పార్థే! అచ్చు నా పార్థ

మళ్ళీ! ఆ నాలుగురోజులూ పార్థని మరచిపోయినా. కైదులోంచి చేతులు జాచి నన్ను కావిలించుకున్నాడు. ఆ వుంగ్రాలజుట్టు! మెరిసే చిన్నకళ్ళు! అతనే! పోలీసులు అతన్ని నా దగ్గరికి రానియ్యక పోతే తపస్సుచేసి చిన్న వాడై నా దగ్గరికి యెగిరివొచ్చి నా రొమ్ముమీదచేతులేసి, పాలు కుడుచు కుంటున్నాడు. దొంగ నా పార్థ అబ్బాయిని చేతుల్లో పట్టుకొని, లేచి, పరు గెత్తుకెళ్ళి జైలులోకి—

"చూడు! చూడు! పార్థా చూడు యెవరో!" అనాలని ఒకటే బాధపడ్డా! చప్పున లేచాను మరచిపోయి. కళ్ళు తిరిగి, కాళ్ళు వొణికి, కూలపడ్డాను.

అయితేనేం? పార్థ వొస్తాడుగా! దమ్మిడీ అంత చిన్న యెర్రని నోరు, లేతచిగుళ్ళు ఆ మడమలు, యెన్నిసార్లో ముద్దు పెట్టుకున్నా.

"పార్థా నా పార్థ" అన్నాను. అప్పుడప్పుడు ఆ నల్లకళ్ళు తెరిచి నావంక నిదానంగా చూసేవాడు. నేను తెలుసు, నేను గుర్తుకదూ మరి?

15

బారసాల జరిగింది. శేషగిరిరావు నాయుడని పేరుపెట్టారు. కాని నేనుమాత్రం "పార్థా"అని పిలిచేదాన్ని. ఆయన యెత్తుకోడానికి వొచ్చారు. మొదట నాకు వొళ్ళు మండిపోయింది. "పో" అని అరిచాను. కానితరవాత యేంచెయ్యను! ఆయన ముద్దాడగానే అబ్బాయిని కడిగేదాన్ని, వాడెవడో నాబిడ్డని నా కిష్టంలేంది ముట్టుకోడానికి? ఆయన "శేషా" అంటే అబ్బాయి అట్లా చూసేవాడన్నా కాదు. నేను "పార్థా" అంటే అప్పటికప్పుడే నావంక చూసి నవ్వేవాడు. ఇంకా నారోజులన్నీ నాచిన్నిపార్థతో సరిపోయినాయి. నీళ్లు పొయ్యడం, పాలు తాగించడం. మళ్ళీ నా వొళ్ళు చక్కగా అందంగా అయింది. నాకళ్ళల్లో కొత్తమెరుపు వొచ్చింది. ఇంక పార్థ రాకపోతేనేం అనిపించింది. అంత ఆనందంగా వుంది, అబ్బాయినిచూస్తే. కాని పాపం కైదులో యేంచేస్తున్నాడో! నాకీచిన్న పార్థని యిచ్చినందుకుకదూ? ఆ మహా పాపానికికదూ అతన్ని రాళ్ళు మోయిస్తోంది! అదేం న్యాయమో? పాడుకోర్టులు! అన్నీ అన్యాయాలే!

అబ్బాయిపుట్టినా నన్నెవరూ చూడడానికి రాలేదు. అబ్బాయి పుట్టిం తరవాత ఆస్థి ఆశ వొదులుకున్నారు బంధువులు. ఆయన చుట్టూ తిరిగే

అన్నకొడుకులూ వాళ్ళూ మొహమన్నా కనపరచలా! లేచిపోయిందాన్ని తీసుకొచ్చి, దాని బిడ్డకి ఆస్తి యివ్వడం వాళ్ళకేమీ బావుండలేదు. అతినీచమైనపని చేశాడని అందరితోటీ సాటించారు.

16

నాబాబు పాకుతాడు. నన్ను "అం" అంటాడు, నేను బాగాగుర్తు. ఒక్కనిమషం నేను కనపడకపోతే యిల్లంతా "అం, అం" అనుకుంటో తిరుగుతాడు. దొరగారు నిద్రలేచేటప్పటికి నేను పక్కదగ్గిర యెదురుగా కనపడాలి. లేకపోతే దూకుడు చేస్తారు. పొద్దస్తమానం వొంటరిగా యిద్దరం ఆడుకునేవాళ్ళం. ఒక కుక్క బొమ్మను కొన్నాను. దాని తలమీద కొట్టి అరిపిస్తే ఒకటే నవ్వేవాడు. ముందు యెలికపళ్ళు రెండొచ్చాయి. నావొళ్ళో కూచుని నా చెంపలమీద చిన్ని చేతులు వేసి, యేమిటేమిటో కబుర్లు చెప్పేవాడు. నేను పిచ్చిసంగతులు వాగేదాన్ని. మాట్లాడ్డానికి నా కింకెవ్వరున్నారు? మధ్యాహ్నం వసారాలో పిచ్చికలు గింజల్ని యేరుకుంటోవుంటే, పిల్లి పెట్టెమూల నిద్రపోతూవుంటే, యెండ మెల్లిగా పాకి మావేపు వస్తూవుంటే, పార్థ కబుర్లన్నీ నా చిన్ని పార్థతో చెప్పేదాన్ని. నాన్న వొస్తాడనీ, ఆడుకుందామనీ చెప్పేదాన్ని. అర్థమైనట్లే "ఊ, ఊ," అనేవాడు. ఇంకా కొంచెం యెదిగింతరువాత "నాన్న వొస్తారు" అంటే "న్న, న్న," అని ఆ ముసలాయన గదివేపు చూపించేవాడు. "లేదు తాత" అని నాలుగురోజులు నేర్పాను. ఒకరోజు ఆయన రాగానే "తా, తా, తా" అనుకుంటో దగ్గిరికి వెళ్ళాడు. గోడవెనక నుంచుని మనసుతీరా నవ్వాను.

రాత్రంతా నా పక్కన నిద్రపొయ్యేవాడు. పడుకుంటే యెంత బావుండేవాడని! అంత అందమైన అబ్బాయిని యెక్కడా చూడలా! పార్థ కూడా అంత అందంగా వుండడు. మీకు పిల్లలుంటేతప్ప, లేకపోతే మా చిన్న పార్థ అందరిలోకీ అందమంటారు.

ఒకరోజు చిన్నపార్థకి జబ్బుచేసింది. అప్పుడు తెలిసింది నాకు అబ్బాయిమీద యెంతప్రేమో. ఒక్కసారి అబ్బాయి కక్కుకుంటే, నేను పేగులన్నీ కక్కేసినంత బాధగావుండేది. అబ్బాయి చచ్చిపోతాడేమోనని ఒకటేభయం. రాత్రంతా మేలుకుని వొళ్ళోపెట్టుకుని కూచున్నా.

నావోళ్ళోవుంటే చచ్చిపోడని ధైర్యం. వోళ్ళోవుంటే యెప్పుడూ నాదగ్గిర వుండేవాడేమో, యిట్లా వంటరిగా నన్ను వదలకండా.

17

ఒకరోజు మధ్యాహ్నం పార్థ కనపడ్డాడు. కిటికీదగ్గిర తల దువ్వుకొంటో నుంచున్నా. ఇంకా పది పదిహేను రోజులకిగాని, రాడని నా లెఖ్ఖ. కిటికీదగ్గిరికి వోచ్చి "రాత్రి పదింటికి వోచ్చెయ్యి. రోడ్డుమీద వుంటా" అని వెళ్ళిపోయినాడు. యెంత విశ్వాసమో! వోస్తానో రానో, అనే సందేహమే లేదు. ఇంకే వొక్క నిముషం ఆయింటో యెందు కుంటాను? అబ్బాయిని తీసుకెళ్ళాల్లా, లేదా అని సందేహమొచ్చింది. ఇక్కడేవుంటే యీ ఆస్థి యిల్లు భూములు, అన్నీ వుండి సుఖపడతాడు. కాని నాతో వోస్తే కటికదరిద్రం. రేపణ్ణించి వెండిగిన్నెలూ, పరుపు, వుయ్యాలా, పట్టు చొక్కాలూ వుండవు. కాని నేలేకండా ఒక్కడూ యెట్లా వుంటాడు?

మర్నాడికే ముసలాయన కబురు.

"నువు పోతే పోయినావు. నాకొడుకుని తీసుకు పోవడానికేమీ అధికారం లేదు, అబ్బాయిని పంపించమని."

తన కొడుకుట? నా అబ్బాయిని యివ్వను పొమ్మన్నాను. అల్లరి అవుతుంది, నెమ్మదిగా యివ్వమన్నారు. నేనిస్తానా? నేనెందుకిస్తాను?

ఆ పదిరోజులూ యెక్కడ వున్నామో, యేంతిన్నామో జ్ఞాపకంలేదు. యెక్కడో వూరిబయట యేదోగుడిశలో వున్నాం. ముగ్గురం కావిలించుకుని పడుకునేవాళ్ళం, యెంతో ఆనందంగా. కాని నాకు ఒక కష్ట మనిపించింది. నా చిన్ని పార్థని చూసి, పార్థ యెంతో ముచ్చట పడతాడనుకున్నా. యెత్తుకునేవాడు గాని, అంతా నాకోసమే. అతని కళ్ళన్నీ నామీదే వుండేవి. అయితే నేం? అంత సంతోషం యింక యెన్నడూ నే ననుభవించలా. అక్కడితో ఆఖరు. ఆరోజు నే చచ్చిపోయినాను. కోర్టుకు సమన్లువొచ్చాయి, అబ్బాయిని తండ్రికి వొప్పచెప్పమని. పార్థ వూళ్ళోకి ప్లీడర్లతో మాట్లాడ్డానికి పరుగెత్తాడు. దిగులు మొహం వేసుకు వొచ్చి "లాభం లేదట, అబ్బాయిని యిచ్చెయ్యాలి" అన్నాడు.

నాగుండెల్లో రాయిపడ్డది. నా అబ్బాయిని యివ్వాలా! కాని నేను నమ్మలేదు. లోకంలో అంత ఘాతకులు వుంటారనుకోలేదు. తల్లికన్న

పిల్లని యింకోడికి యిప్పిస్తారా? ఆవుదగ్గిర్నించి దూడని తియ్యరే? కోడినించి పిల్లని తప్పించరే? భూతదయగల దేశమే? నా దగ్గిర్నించి నన్నొక్క నిమిషం విడవని యీ గుడ్డుని, లాక్కుంటారా? పాలు విడవని కూనని, కన్ను తెరవని పాపని, నాదేహంనించి కోసేస్తారా? అంటు తొక్కి వెంటనే చెట్టునించి విడతీస్తారా? పసిపిందెని ప్రాణంలేని చెట్టునించి కొయ్యరే? నాపాపని నా నుంచి తుంచేస్తారా? ఆయనకంటే నామీద కోపంకాని కోర్టువాళ్ళ కేం కోపం నామీద?

ఆ నాలుగురోజులూ పాపని వొక్క నిమిషం విడువకుండా యెత్తుకున్నా. యెవరోవొచ్చి అబ్బాయిని నాదగ్గర్నించి లాక్కు వెడుతున్నట్టే వుండేది. పార్థ పిలిచినా నేను పలకలేదు. అతనికి కోపంకూడా వొచ్చింది. కోర్టుకు వెళ్ళాం. యేమేమిటో చేశారు. నన్నేమిటో ప్రశ్న లడిగారు. తండ్రి ఆస్థి గనక, కొడుకుని తండ్రికి వప్పచెప్ప మన్నారు. నాగుండె నీరైపోయింది. నే నివ్వనన్నాను. వీల్లేదు, లాక్కుంటామన్నారు. పార్థ నన్ను వూరుకోమన్నాడు. యేం చెయ్యను? యెవరుదిక్కు? మాస్ట్రీటు కాళ్లమీద పడ్డాను.

"నన్ను వొదిలి బతకడు. చచ్చిపోతాడు. నా బిడ్డని యేడిపించకండి. ఒక్క నిమిషం నేను లేకపోతే అమ్మా అమ్మా అని అల్లాడి పోతాడు. నా బిడ్డని వొదిలి నేను బతకలేను. మీకు పిల్లలు లేరా? మీది కడుపు కాదా?" అని యేడ్చాను.

అవును మరి ఆ మేస్ట్రీటు మాత్రం మొగాడు కదూ? ఆయనభార్య లేచిపోతే, వంశం పేరుపెట్టి, పిల్లనీ తల్లినీ వేరు చేసి హింసపెట్టవద్దూ? ఆ మొగవాళ్లందరూ కట్టు. అప్పటికీ ఆయన కళ్ళంబడి నీళ్ళు కారాయి. మొహానికి దయవొచ్చింది, ముసలినాయుణ్ణి చూసి,

"పోనీవయ్యా యింకో రెండేళ్ళు తల్లిదగ్గిరవుణ్ణి" అన్నాడు.

"వీల్లేదు. దాని దగ్గర ఒక్క నిమిషం వీల్లేదు" అన్నాడు. ఆ నాయుడు.

"అయితే తల్లిదగ్గిర్నించి లాక్కెడతావా? బతుకుతాడా ఆపిల్లవాడు?"

నా కెంతో సంతోషమయింది. ఇంక అబ్బాయి నా దగ్గిరేవుంటాడు. యింతలో ముసలాయన—

"అంత పిల్లవాడిమీద దయ గలిగిందైతే వొచ్చి యింటో వుండమనండి! నేనొక్క పల్లెత్తుమాట అన్నానా?" అన్నాడు.

"అవును వెళ్లు" అన్నాడు మేస్ట్రీటు. ఇట్లా తిరుగుతుందనుకో లేదు నేను. పార్థవంక చూచాను. అబ్బాయివంక చూశాను. యేం చెయ్యాను? అంతలో తటాలున ఒక ఆలోచన తోచింది. వొళ్ళు పులకరించింది. ఇంక బతికిపోయినా ననుకున్నాను. సిగ్గుపోయింది. నా ప్రాణంకోసం పోట్లాడే టప్పుడా సిగ్గు! యింకేం? తలయెత్తి మెల్లిగా

"అసలు యీ అబ్బాయి ఆ ముసలాయినికి పుట్టలేదు" అన్నాను.

ఆమాటతో కోర్టు అంతా నిశబ్దమయింది. ఒక్క నిమిషం వూపిరి బిగపట్టారు. యెవరో కొంచెం నవ్వారు. అందరూ గొల్లుమన్నారు, మేస్ట్రీటుకూడా. నాకు అపరిమితమైన సిగ్గేసింది. యెట్లా అన్నానో ఆమాట? యెక్కడన్నా మొహం దాచేసుకోవా లనిపించింది. మేస్ట్రీటు నవ్వు ఆపు కుని—

"ఆసంగతేమిటో మాకు తెలీదు. అయినా, ఆయన కొడుకే" అన్నాడు.

ఇదేమిటి? యిదేం న్యాయం? ఆయనకేమీ సంబంధంలేనిది! తొమ్మిది నెలలూ మోసి, అంతబాధపడి, తెచ్చుకుంటే, నాపార్థ దగ్గర్నించి వీళ్ళు ఆముసలాడికి యిమ్మంటారేం? నమ్మకపోతే విచారణ చేయరాదూ?

పార్థకి కోపం వొచ్చింది.

"వీడు నాకొడుకు. ఆ ముసలివాడికి కొడుకులే! దోమని గుడ్డు పెట్టించ మనండి. పన్నెండేళ్ళు కష్టపడి! ఆయనకి కొడుకేమిటి?" అన్నాడు.

అందరూ మళ్ళీ నవ్వారు - కాని వాళ్ళకి నచ్చలేదు. నన్నూ అబ్బాయినీ నాయుడితో వెళ్ళమని వుత్తరువు చేశారు. నాకు అధైర్యం వొచ్చింది. ఇంతా సిగ్గు విడిచి చెప్పినా కార్యంలేదు. యెవడు ఆముసలి వాడు మధ్య? మళ్ళీ న్యాయమటు. పక్షపాతం లేదటు! ఆముసలివాడు మేస్ట్రీటుకి లంచం యిచ్చివుండాలి. పార్థని మళ్ళీ ప్లీడర్ని కనుక్కో మన్నాను. అతనూ అదే అన్నాడు. నాయుడి భార్యని కనక, యెట్లా కన్నా ఆబిడ్డ నాయుడ్డి బిడ్డలేట! యేం తెలివిగా, సరసంగా వుంది! ఆంబోతుకి కన్నా దూడలు, కాపువాడి వైనట్లు! నేను గొడ్డునే! నన్ను ముసలాయన కొన్నాడు. తిండి పెట్టాడు. కనక నాదూడలు ముసలాయనవే! మళ్ళీ వీళ్ళు మనుషులటు! నాగరికంటు! ఋషులూ, యోగులూవున్న దేశంటు! స్వరాజ్యంటు. యిదీ న్యాయం! నేను గొడ్డునా చెట్టునా!

మర్నాడు ప్రొద్దున్న యేదీ చెపుతానన్నాను. సాయంత్రమంతా ఆలోచించా. పార్థని వొదిలి యెట్లా వెళ్ళను. నాకోసం కైదుకి వెళ్ళాడు.

తల్లిదండ్రుల్ని వొదిలాడు. ఇప్పుడతన్ని యెట్లా వొదలను ? అతన్ని వొదిలి యెట్లా బతకను ? అతనే నా ప్రాణం, అతనే నా జీవం. వొదల్లేను, కాని నా చిన్ని పార్థని ? యెట్లా ? యెట్లా ? తప్పదు. నాపార్థకోసం, నా అబ్బాయిని యిచ్చెయ్యాలి. అందరు తల్లులూ మొహాన వుమ్మేస్తారు. కాని నాపార్థ చేతులు నాచుట్టూ వుండకపోతే నాకు వొక్క నిమిషం విశ్రాంతి వుంటుందా ? నేను పడుతున్న నరకబాధ అబ్బాయి కేం తెలుసు ! యేడుస్తున్నా వాణ్ణి వొళ్ళో పెట్టుకుని; వూరికే కన్నీళ్లు తుడుస్తాడు. చంపలు ముద్దు పెట్టుకుంటాడు; నవ్వుతాడు; నన్ను నవ్వించాలని చూస్తాడు.

"నాయనా ! నీకు రేపు 'అమ్మే'దిరా ? దిక్కుమాలిన అమ్మ తన సౌఖ్యంకోసం నిన్ను వొదులుకుంది. నాకెందుకు పుట్టావు, నా భాగ్యమా ? ఈ నిర్భాగ్యురాలికి ?"

అన్నం పెట్టాను. ఒకటే నవ్వులు, గంతులు. అన్నం తినడు, పరిగెత్తుతాడు. చివరికి అలసి నాచేతుల్లో రొమ్ముకి తల ఆనించుకొని నిద్రపోయినాడు. ఆఖరుసారి, నా జన్మకి ఆఖరుసారి నిద్రపోయినాడు. కఠినాత్మురాలిని మెల్లిగా చెయ్యి వొదిలించుకొని పక్కమీద పడుకోపెట్టా. చందనంబొమ్మ యింకా చేతులోనే వుంది. నవ్వితే వొచ్చినతడి చెంపనే వుంది. యేడుస్తో పార్థదగ్గిరికి వెళ్ళి,

"పార్థా ! అబ్బాయిని వొదల్లేను. వొదిలి నేను బతకలేను." అని గోల పెట్టాను.

పాపం యెంతో వోదార్చాడు. రాత్రి అంతా అట్లానే కూచుని యేడ్చాను. అయ్యో యెంత బాధపడ్డాను ! నక్షత్రాలు భయపడి నావంక చూశాయి. చిన్న చంద్రుడు అస్తమించాడు. చలిగాలి వేస్తోంది. తలుచుకొని తలుచుకొని ప్రతి నిమషం వెక్కి వెక్కి యేడ్చాను అబ్బాయి కోసం. పక్కలో కూచుని మళ్ళీ కావిలించుకొని యేడాన్చు నిద్రలో కదిలి "అమ్మా ! భయం" అన్నాడు. జోకొట్టాను. రేపు "అమ్మా భయ" మంటే యెవరు పలుకుతారు ! ఒక్క నిమిషం రెప్పవాల్చకుండా యేడవడం యెంత బాధ ! వీపంతా గుండెలంతా గునపంపెట్టి పొడుస్తున్నట్టుంది. అబ్బాయి చచ్చిపోతే తీరిపోను ! బతికి వుండి అమ్మ, అమ్మ, అమ్మ, అని అన్నం తినక ఆ పాడుబడ్డ యిల్లు మూల మూల అమ్మేది ? అని వెతుకుతూ వుంటే, వూరిబైట నే నెట్లా బతుకుతానురా నాయనా ?

తెల్లవారిపోయింది. అబ్బాయిని యివ్వమని మనిషి వొచ్చాడు. నిద్ర పోతున్న అబ్బాయిని లేపాను. యీ చేతులతో (వాటిని కాల్చిన ఆపాపం పోదు.) వాడికి అప్పచెప్పాను. గుప్పెటతో కళ్ళు నులుముకుంటో "యెక్కడికి. అమ్మా? అమ్మా!" అన్నాడు, పలక్కపోతే తిరిగిచూచి నావేపు చేతులుచాచి.

"అమ్మా అమ్మా" అని అరుస్తూ యేడ్చాడు. తాడిచెట్లలోంచి దూరంగా దూరంగా యింకా దూరంగా! నా బాబుగొంతుక యెవరో నొక్కినట్లు అమ్మా అంటో వినపడ్డది. చచ్చిపోయినాను. ఆనాడే దెయ్య మైనాను. ఆ వుదయానే చీకటిపడ్డది. ఇంత కటికిదాన్ని గనకే నాకిన్ని దుఃఖాలు.

అబ్బాయి రాత్రి పడుకున్న పక్కగుడ్డలమీద పడుకున్నాను. వాటిని మళ్ళీ మళ్ళీ కావిలించుకున్నాను. వాడివొంటి మధురమైన వాసన వాటికి అట్లానేవుంది. కాని అబ్బాయిని యెప్పటికి వొదులుతున్నా ననుకోలేదు. వాడు మారాంపట్టి నాకోసం యేడవగానే, నాయుడుగారు నాదగ్గిరికిపంపే స్తారనే నిశ్చయం లోపలవుంది. అదే ఆఖరుసారి అబ్బాయిని ముద్దాడేది. అనుకుంటే నాకొడుకుగతి అట్లా అవుతుందంటే, పార్థనన్నా వొదిలేసి అబ్బాయితో వెళ్ళేదాన్ని కదూ?

అతను ఆరాత్రే వెళ్ళి నాయుడుగారి దాసీదానితో మాట్లాడి రెప్పా డన్నా ఒకసారి అబ్బాయిని రాత్రి పడ్డతరవాత గుమ్మంలోనాకు చూపిం చేట్టు యేర్పాటు చేశాడు.

18

మెల్లిగా దుఃఖం తగ్గింది. పార్థని చూస్తేచాలు, నాకులోకం. కాని అబ్బాయి యెట్లా వున్నాడో అమ్మా అని వెతుక్కుంటున్నాడేమో, అని జ్ఞాపకమొచ్చి, కడుపులో కలియపెట్టినట్లయ్యేది. అన్నం తింటూవుండగా జ్ఞాపకం వొస్తే యింక తిండిఅంతే. నిద్దట్లో "అమ్మా" అని వినపడి వులికిపడి లేచేదాన్ని. రాత్రంతా చేతులు వుత్తవిగా లేకండా పార్థని రొమ్ముకి అదువుకుని కదలనీక పడుకోపెట్టుకునేదాన్ని, ఆఖరికి ఒకరోజు దాసీది చీకటి పడ్డ తరవాత నన్ను రమ్మందిట. యెన్నోకొన్నాను. మిఠా యిలు బొమ్మలు అన్నీ చీకట్లో నడుస్తూవెళ్ళి. అబ్బాయిని ఆడిస్తూ తీసు

కొచ్చింది. నన్ను చూడగానే అమ్మా అని మీదపడి బిగ్గరగా యేడ్చాడు. బాబూ అదేరా యీపాడుచెవులతో నేనువిన్న ఆఖరిమాట అయిపోయింది. అదే ఆఖరుసారి సంతోషంతో నిన్ను కావిలించుకోడం. యేడుపు విని యింట్లోంచి యెవరో ఆడమనిషి "యేమిటది ? యెందుకట్లా యేడుస్తాడు ? వెధవ ? యిట్లా యేడ్చుకురా" అన్నది. అంటే చప్పున దాసీచేతికిచ్చి నా బంగారాన్ని. చీకట్లోకి పోయినాను. అదెవర్తో నిన్నేడ్చుకు రమ్మంటే నోరెత్తధైర్యంలేక నాకంఠం పట్టుకొని, నువ్వు నామొహం చీకట్లో ఆకళ్లతో వెతుకుతో వెళ్లాడుతో వుంటే, నీచిన్న చేతుల్ని విడతీసి, లాగే ఆదాసీ దానిచేతికి యెట్లా యిచ్చాను నేను ! అట్లాంటి రాక్షసినిగనకే నాదగ్గిర నించి వెళ్ళిపోయినావు. నా భాగ్యమా ! అమ్మ అట్లా వొక్క నిమషం కనపడి మాయమయితే యేమనుకున్నావు బాబూ ? అమ్మ దెయ్యమై వొచ్చిందనుకున్నావా ? అవును ! అమ్మేగా, నాయనా, నీ మృత్యువు !

"అమ్మ అమ్మ" అని యేడుపు వినపడుతోనేవుంది. ఆదెవత్తో లోపల,

"అమ్మకాదు, రిమ్మ, నోరుముయ్యి. రాత్రింబవళ్ళు అమ్మా, అమ్మా అంటావు. నీనోరు పడిపోనూ !.........ముండ, గుడిశేటి......., దాని శాద్ధం......అమ్మ...నీకో అమ్మ ! ఈసారి అమ్మ, అను" అంటోంది.

నోట్లో గుడ్డలు కుక్కుకుని...... బయిట వీధివెంబడి పరిగెత్తాను దొంగమల్లె.

ఇంక వెళ్ళి పార్థతో తగాదా పెట్టాను. అబ్బాయిని తీసుకొని యెక్కడికో అడువుల్లోకి కొండల్లోకి పారిపోదామంటా. యెక్కడున్నా పట్టుకుంటారంటాడు. 'మరి అబ్బాయి నెప్పుడు చూడ్డం ?' అంటే పెద్ద వాడయింతరవాత నా దగ్గిరికి వొస్తాడంటాడు. పెద్దవాడయింతరువాత యెందుకు ? ద్వేషం రాకండా మానుతుందా ?

యీలోపున అమ్మ యెట్లాంటిదో చెప్పి మనసు విరవరూ. నన్ను చూస్తేనే అసయ్యించుకుంటాడు. వీల్లేదు యెత్తుకురమ్మన్నాను. తనని చిన్నప్పుడు వొంటరిగా పారేసిపోయింది, అమ్మ అని చెప్పితే అతనికి నామీద ద్వేషం రాకుండా మానుతుందా ?

19

వారంరోజులు అయింది. మళ్ళీ అబ్బాయిని మరిచిపోతున్నాను.

ఇంతలో దాసీవొచ్చి అబ్బాయికి చాలా జబ్బుగావుందని - పిడుగువంటి మాట వేసిపోయింది.

"పార్థా నేను వెడుతున్నా" నన్నాను.

"యెక్కడికి ?"

"అబ్బాయి దగ్గిరికి"

"రానీరు"

"అక్కడే పడి చస్తా"

"నేనూ ?"

"నాకు తెలీదు. వెడుతున్నా ?"

"నిజం ?"

" నిజం "

"అయితే నేను వెళ్ళిపోనా ?"

"ఎందుకు ?" నువ్వు వెళ్ళిపోతున్నావుగా ? యెక్కడికో వెడతా, ఇంక నేనెందుకు ఇక్కడ ?"

"పార్థా యేంచెయ్యను ?"

"నేనేంచెయ్యను ?"

"నాకు తెలీటంలా యేంచెప్పడానికీ. నేను వెళ్ళాలి, వెళ్ళొద్దూ ? వెళ్ళకండా బతకలేను పార్థా"

నా ఆవేశం చూసేటప్పటికి పార్థకికూడా వుండమనడానికి నోరు రాలేదు. అట్లానే చూస్తో నిలుచున్నాడు పాపం. పార్థా ! నిన్ను అట్లా వొదిలి వెళ్ళిపోతే యేమనుకున్నావు ?

నాకు వొళ్ళు తెలీదు. నా కోసం దిగులుతో అబ్బాయి దిగులుపడ్డాడనేది ఒకటేధ్యాస. పరిగెత్తుకొనివెళ్ళి సరాసరి యింట్లో జొరబడ్డాను. నాయడు "యెవరు నువ్వు ? "పో" అన్నాడు".

"యెట్లావుంది." అన్నాను.

"పో" అన్నాడు.

కాళ్ళమీద పడ్డాను. నాజుట్టుతో కప్పేశా. కన్నీళ్ళతో తడిపా. పాపాత్మురాల్ని దిక్కుమాలినదాన్ని. దుమ్ములో కూలాను. ఇంకా తన్నకండి, అబ్బాయిని చూడనీండి. తరవాత నన్ను రోడ్డుమీద పారెయ్యండి నేను పోను, పోను. నా బిడ్డ ! నా కడుపు ! అయ్యో ! నన్ను చంపెయ్యండి

తరవాత. నా బాబుని బతికించుకోనీండి." అని యేడ్చాను! "ప్తో. లోప లికిపోయి చూడు యెంతకి తెచ్చావో!" అన్నాడు.

వెళ్ళాను. మంచంపక్కన చిన్న దీపం వెలుగుతోంది. సన్నని చేతులు, గుంటకళ్ళు, శ్వాస. నా అబ్బాయి! నా చిన్నకూన! నా తల్లి లేని పక్షి పడివున్నాడు. యెవర్తో కూచునివుంది. నేను రాగానే కోపంగా లేచి పోయింది. చిక్కిపోయిన చెయ్యిపట్టుకొని యేడ్చాను. నావోళ్ళు తెలీదు. దాసీది వొస్తే అడిగాను.

ఆమనిషి ఆయన మరదలట. పిలిపించాడు నాయిడు, నా బాబుని పెంచడానికి. నాబాబును కొట్టేది. తలుచుకుంటే నాజుట్టు పీక్కుంటున్నా: నా మొహం రక్కుకుంటున్నా. అయ్యో బాబూ నిన్నుకొడితే అమ్మని తలుచుకుని యేడ్చావా? యేమనుకున్నావు? నొప్పి పుడితే! తిండి వేళకి పెట్టేది కాదుట.

డాక్టరు బతకడన్నాడుట. నాగుండె జారింది. నిలువునా పడ్డాను. దాసీదాన్ని చేతులు పట్టుకు బతిమాలుకున్నా, డాక్టరుని పిలుచుకొని రమ్మని. యీ రాత్రి వొస్తాడా? నా మెళ్ళో పుస్తెలనాను తెంచి దాసీచేతులో పెట్టి యిది యిచ్చి తీసుకురమ్మన్నాను. వెళ్ళింది.

"బాబూ ఒక్కసారి కళ్ళు తెరిచి చూడు, అమ్మని క్షమించాననూ."

కదిలాడు, రొమ్ము నోట్లో పెట్టాను పిచ్చిగా. తాగలా. కొత్త గావును! లేకపోతే యింక యీలోకంలో పాలు అఖ్ఖర్లేవో "అం అం అం" అన్నాడు.

"బాబూ! వొచ్చాను. పాప్తా! వొచ్చాను చూడు!" అన్నాను.

వినపడలేదు గావును కదల్లేదు. డాక్టరు వచ్చాడు. ఆయన బూడ్సుల మీద పడ్డాను.

"అయ్యా నా బిడ్డని బతికించండి. బతికినన్నాళ్ళు మీ దాసీ దాన్నవు తాను" అని యేడ్చాను.

మళ్ళీ అబ్బాయిని చూశాడు.

"అమ్మా! యేడవకు. నే నేం చెయ్యను? తెల్లవారిందాకాకూడా బతకడు" అన్నాడు. కిందపడి దొర్లి రాగాలు పెట్టాను. నన్ను చూసే దెవరు? వాణ్ణి నాకు వొదిలి యెవరిదోవన వారు పోయినారు. మంచం మీద నా అబ్బాయి పక్కనే నేను తెల్లార్లూ కూచున్నా. అన్నీ జ్ఞాపకం వొచ్చాయి. నామీద యెంతప్రేమ చూపించేవాడు? నోరెరుగనివాణ్ణి, నేను